RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 138 | శుక్రవారం, 06 డిసెంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

# త్వరల్లో.. భారీగా బదిలీలు?

- అధికారుల తీరుపై రేవంత్ అసంతృప్తి
- ప్రతి చిన్న విషయానికి తాను చెప్తే తప్ప పనిచేయడం లేదని పలువురు అధికారుల పనితీరుపై గుర్రుగా ఉన్నారట
- ఇక చేసేదేం లేదు ప్రక్షాళన చేపడుదామని ఫిక్స్ అయిపోయారట
- కీలక శాఖల్లో ఉన్నత హోదాల్లో ఉండి సరిగ్గా పనిచేయని అధికారులను మార్చేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.



హైదరాబాద్

రేవంత్ సర్కార్‌లోని కొందరు అధికారుల్లో ఒకరు ఈస్ట్ అంటే మరొకరు వెస్ట్ అంటున్నారట. ప్రభుత్వం ఒకటి చెప్తే తామొకటి చేస్తున్నారట. ఇన్నాళ్లు చూస్తూ వదిలేసిన సీఎం.. వన్ ఇయర్ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూశాక..కొందరు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారట. ప్రతి చిన్న విషయానికి తాను చెప్తే తప్ప పనిచేయడం లేదని పలువురు ఎఐాల పనితీరుపై గుర్రుగా ఉన్నారట సీఎం. ఇక చేసేదేం లేదు ప్రక్షాళన చేపడుదామని ఫిక్స్ అయిపోయారట. కీలక శాఖల్లో ఉన్నత హోదాల్లో ఉండి సరిగ్గా పనిచేయని అధికారులను మార్చేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. వాళ్ల పొజీషన్‌లో ఎవరినీ తీసుకోవాలో కూడా ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ పది రోజుల్లోనే సెక్రటేరియట్‌లోని కీలక శాఖల అధికారుల మార్పులు, చేర్పులు

# ఆనాడు రేవంత్ రెడ్డిని చిన్న కేసులో అరెస్ట్ చేశారు

- మరోసారి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు..
- బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయాక కార్యకర్తలు గుర్తుకు వస్తున్నారని విమర్శ
- తెలంగాణ కోసం మంత్రి కోమటిరెడ్డి రాజీనామా చేశారు
- కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలని సూచన

హైదరాబాద్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మరోసారి ఫైర్ అయ్యారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. "కేటీఆర్ భాష దారుణంగా ఉంది. కేటీఆర్ కంటే.. కేసీఆర్ బెటర్‌గా మాట్లాడుతారు. కేటీఆర్ భాష అసహ్యంగా ఉంది" అంటూ విమర్శలు గుప్పించారు. విద్యార్థులు పోరాడితే తెలంగాణ వచ్చిందన్నారు. ఉద్యమంలో కేసీఆర్ కుటుంబంలో ఎవరికి ఒక గీత కూడా పడలేదన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి ఆత్మహత్య





## పీఎస్ఎల్‌వీ సీ-59 సూపర్ సక్సెస్

- సూర్యుడి సీక్రెట్స్ తెలిసినట్లే..
- శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ సి-59
- యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ఉపగ్రహాలను మోసుకెళ్లిన రాకెట్
- నిప్పులు చిమ్ముతూ రోదసికి ఎగిసిన పీఎస్ఎల్వీ-సి59
- శాస్త్రవేత్తలను అభినందించిన ఇస్రో చైర్మన్

# కేసీఆర్ గారూ... అసెంబ్లీకి రండి

- కేసీఆర్ సభకు వచ్చి సూచనలివ్వాలని విజ్ఞప్తి
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్‌ను ఆహ్వానిస్తాం
- కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ని కూడా ఆహ్వానిస్తామన్న ముఖ్యమంత్రి
- ప్రభుత్వం అంటే 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రమే కాదని వ్యాఖ్య
- ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తాం



హైదరాబాద్

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆహ్వానిస్తామని, మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లి ఆయనను ఆహ్వానిస్తారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ని కూడా ఆహ్వానిస్తామన్నారు. ఈ నెల 9న విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. మనలో తమిళనాడు స్ఫూర్తి లోపించిందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అంటే 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రమే కాదని, 119 మంది ఎమ్మెల్యేలు కలిస్తేనే ప్రభుత్వం అవుతుందన్నారు. ప్రతిపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉండటం రాష్ట్రానికి మంచిదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని... ఆయన తన చతురతతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని సూచించారు. కేసీఆర్ గారూ... అసెంబ్లీ సమావేశాలకు రండి,



## ప్రజలకు చట్టాలంటే భయం లేదు

- వారి నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు
- రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన
- తానూ రోడ్డు ప్రమాద బాధితుడేనని వ్యాఖ్య
- ప్రజల సహకారం లేకుండా రోడ్డు ప్రమాదాలు తగ్గించలేమన్న కేంద్రమంత్రి
- రోడ్డు ప్రమాదాల్లో ఏడాదిలో 1.68లక్షల మంది దుర్మరణం..
- ఆందోళన వ్యక్తం చేసిన నితిన్ గడ్కరీ



## మహారాష్ట్ర సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణం

- డెప్యూటీ సీఎంలుగా షిండే, పవార్
- సీఎంగా ప్రమాణం చేయించిన గవర్నర్ రాధాకృష్ణన్
- ముంబైలోని ఆజాద్ మైదానంలో ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరైన ప్రధాని, ఏపీ సీఎం, కేంద్రమంత్రులు



## రేవంత్ రెడ్డి మీ పాలన మార్పు మార్కు ఇదేనా

- రాజ్యాంగాన్ని కాపాడుదామని రాహుల్ గాంధీ గారు రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరుగుతడు...
- నువ్వేమో తెలంగాణలో అడుగడుగునా రాజ్యాంగ ఉల్లంఘన చేస్తూనే ఉంటవు...
- ప్రజాక్షేత్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని, వెంట పడుతూనే ఉంటాం

# నాణ్యమైన భోజనం అందించాలి

- తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు..
- పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అంశంలో హైకోర్టు కీలక ఆదేశాలు
- భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై నివేదిక కోరిన హైకోర్టు
- ప్రభుత్వం రెండు కమిటీలను ఏర్పాటు చేసిందన్న ఏఏజీ
- నాణ్యమైన భోజనం కోసం నిధులను 40 శాతం పెంచినట్లు చెప్పిన ఏఏజీ
- తదుపరి విచారణను కోర్టు 6 వారాలకు వాయిదా



హైదరాబాద్

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అంశంపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. పాఠశాల్లలో తప్పనిసరిగా విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని ఆదేశించింది. భోజనం వికటించిన విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలకు సంబంధించిన నివేదిక సమర్పించాలంటూ విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది.

తెలంగాణ సేన

శుక్రవారం, 06 డిసెంబర్, 2024

## సంపాదకీయం

### “”””చారిత్రక జవాబు”””

సంకుచిత సమాజం సంధించిన ప్రతి ప్రశ్నకు
తానొక “చారిత్రక సమాధానం”
బడి గది బయటే నీ స్థానమంటే
ఆయన జన్మదినమే “ప్రపంచ జ్ఞాన దినోత్సవమని”
ఐక్యరాజ్య సమితి అలవోకగ ఇచ్చెను సమాధానం
గుడిలో ప్రతిమల పూజకు పోతే మైలని బయటకు నడవమంటే
ఆ దేవుళ్ళకంటే అతి “”ఎత్తయిన ప్రతిమగ””” మారిన
మహోన్నత జీవన పయనం
కత్తి, రక్తం అంటకుండా
కలము,జ్ఞానంతో
కుల రాజ్యాలను కూల్చిన రాజసం
బానిస బ్రతుకులే నీ జాతులకంటే
భరత భూమిని “”రాజ్యాంగంతో”””” పాలన చేసే నీ ప్రజ్ఞా పౌరుషం
కూటికి లేనోడి చీకటి బ్రతుకులో వెలుగుగా మారెను
ఓ “”అంబేద్కరుడ””” నీ జీవన పాఠం.



నేపా. సంతోష్ అచ్యుత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత.

# తెలంగాణా ప్రజల ఆకాంక్షలు నెరవేరేనా..?

సమయానుకూలంగా, స్వంత అవసరాలకోసం పలుమార్లు మాటలు మార్చి మాట్లాడుతున్న సందర్భంలో నరం లేని నాలుక ఎటైనా, ఏదయినా మాట్లాడుతుంది అనడం పరిపాటి. “నరం లేని నాలుక” అన్నది తెలుగు రాష్ట్రాల్లో బాగా పరిచయం ఉన్న లోకోక్తి. దీన్ని ప్రధానంగా మాటి మాటికీ మాట మార్చుతూ మాట్లాడే వారికోసం, మాట్లాడే మాటకు ఆచరణకు తేడా ఉన్న సందర్భంలో దీన్ని వాడుతుంటారు. ప్రధానంగా రాజకీయ పార్టీల నేతలు, అధికారం దక్కించుకోవడం కోసం,అధికారం లో ఉన్న ప్రజాప్రతినిధులు దీని వాడకంలో అగ్రగణ్యులు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట ఒంటి మీద బట్టలు మార్చినంత తేలికగా మార్చి మాట్లాడేయగలరు. అందుకే ఈ పదం వారికి ఎక్కువగా నప్పుతుంది. అధికారం కోసం,ఉన్నతపదవి దక్కించుకోవడానికి రాజకీయ పార్టీ నేతలు ఎన్నికల సమయంలో చేసే వాగ్దానాలు ఇలాగే ఉంటాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో, ప్రధానంగా తెలంగాణలో నేతలకు ఇది పరిపాటిగా మారింది. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పించి అధికార పీఠం ఎక్కేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీఆర్ ఇంద్రవెల్లి వెళ్లి నక్సలైట్లే దేశభక్తులు అన్నాడు. ఖాకీ డ్రెస్ వేసుకుని కార్మికుల కోసం పిడికిలెత్తినట్లు నటించారు. అధికారంలోకి రాగానే నక్సలైట్ల అణచివేత కోసం గ్రేహౌండ్స్ బలగాలను సృష్టించాడు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీలో ఉంటూనే మామను గద్దె దింపి అక్రమ మార్గంలో అధికారం దక్కించుకున్న చంద్రబాబు గ్రీన్ టైగర్స్, రెడ్ టైగర్స్, బ్లాక్ టైగర్స్ అంటూ ప్రైవేట్ హంతక ముఠాలను సృష్టించి వివిధ ప్రజా సంఘాల నాయకులను, బెదిరించాడు. పౌర హక్కుల నేతలను, ఉద్యమకారులను కిరాతకంగా హత్యలు చేయించాడు. తెలంగాణ నడిబొడ్డున హైదరాబాదులో ఉన్న అసెంబ్లీలో తెలంగాణ అనే పదం వాడవద్దని, వెనుకబడ్డ ప్రాంతాలు అనాలని స్పీకర్ తో రూలింగ్ ఇప్పించాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులపై క్రూర నిర్బంధాన్ని ప్రయోగించాడు. ఆట- పాట- మాట బంద్ అన్నాడు. ప్రజా గాయకుడు గద్దర్ పై కాల్పులు, మారోజు వీరన్న బూటకపు ఎన్ కౌంటర్, బెల్లి లలిత, అలుగుబెల్లి రవీందర్ రెడ్డి దారుణ హత్యలు ఈయన కాలంలో జరిగినవే. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజల, మేధావుల, బుద్ధి జీవుల డిమాండ్ కు తలొగ్గి వైయస్ రాజశేఖర్ రెడ్డి నక్సలైట్లతో శాంతి చర్చలు తూ.తూ.. మంత్రంలా జరిపాడు. వెనువెంటనే తెలుగు రాష్ట్రాల్లో బూటకపు ఎన్ కౌంటర్లతో రక్తపుటేరులు పారించాడు. మావోయిస్టుల ఎజెండానే తమ ఎజెండాగా ప్రకటించిన కె.సి.ఆర్. ప్రభుత్వం మేడారం అడవుల్లో శృతి, సాగర్ లను అత్యంత పాశవికంగా హత్య చేసింది. తర్వాత కొంత దిద్దుబాటు చేసుకున్నట్లు కనబడింది. కానీ, ప్రజా నిరసనలకు అనుమతించలేదు. తద్వారా ఏర్పడిన ప్రజాగ్రహ ఫలితంగా టి. ఆర్. ఎస్. అధికారం కోల్పోయింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో ఏ మాత్రం సంబంధం లేకుండానే,ఎలాగైనా ఉన్నత పదవి సంపాదించాలని ఆలోచించి కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడయ్యాడు రేవంత్ . నక్సలైట్ల వల్ల అభివృద్ధి జరగదని భావించాము గానీ, వారు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిపిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి పలు వేదికలపై చిలక పలుకులు పలికాడు. మావోయిస్టులు రావాలి, ప్రగతి భవన్ పేల్చి వేయాలి అనే స్థాయి వరకు కాంగ్రెస్ నేతల గొంతులు హోరెత్తాయి.ఎలాగైతేనేం, చంద్రబాబు సహకారంతో అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే రెండు బెటాలియన్ల భద్రాచలం, ములుగు ప్రాంతాలకు కావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాడు. సంవత్సర కాలంలోనే ఆ రెండు ప్రాంతాలలో వేట ప్రారంభించి, ఎన్ కౌంటర్ల పేరిట విప్లవకారులను కాల్చి చంపింది. నాడు తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టి,నేడు మావోయిస్టులమీద గన్నులు పెట్టిస్తున్నాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రం కొనసాగిస్తున్న కగార్ ఆపరేషన్ లో భాగస్వామి అయి మావోయిస్టులను అతి ఘోరంగా, క్రూరంగా ఎన్ కౌంటర్ల పేరున హత్యలు చేయిస్తున్నది. ప్రజా సంఘాలు మీటింగ్ లు పెట్టుకునే అవకాశాలు కల్పించడం, ఎన్కౌంటర్ మృతుల కోసం సమావేశాల నిర్వహణ అనుమతులు. పౌరహక్కుల నేతల విజ్ఞప్తులను, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాలను తెలిసుకోవడం వంటివి చేస్తున్నారు. కొంత ప్రజాస్వామికంగా కనిపించినా ప్రజల ఆకాంక్షలకు తగినంత మాత్రంలో నెరవేర్చడం లేదు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ప్రచారం చేసిన లేదా భావించిన బుద్ధిజీవులకు, ఉద్యమ కారులకు ఈ వరుస ఘటనలతో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. సుమారు ఆరు దశాబ్దాలపాటు వివిధ పోరాట రూపాలలో ఉద్యమించి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆశలు అడియాసలవుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజల మౌలిక సమస్యల పరిష్కారాన్ని ప్రక్కదారి పట్టించేందుకు అభివృద్ధి పేరిట వరుస సమస్యలను సృష్టిస్తోంది. మూసీ సుందరీకరణ, దామగుండం అడవిలో రాడార్ స్టేషన్ ఏర్పాటు, గతంలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని ఫోర్త్ సిటీగా అభివృద్ధి, లగచర్ల లో ఫార్మా సిటీ ఏర్పాటు కోసం, దిలావర్ పూర్ ఇథనాల్ కంపెనీ (ప్రజల తిరుగుబాటుతో వెనక్కి తగ్గడం), మెట్రో రైల్ దారిపొడిగింపు, రీజనల్ రింగ్ రోడ్డు, ఇలా పలు రకాల ప్రతిపాదనలను చేస్తూ నిరంతరంగా ప్రజలను, ప్రతిపక్షాలను తప్పుదారి పట్టించే కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత సమస్యలు బయటకు పొక్కకుండా, ప్రజా పాలన నినాదాన్ని ఎత్తుకొని కోట్లాది రూపాయలు ప్రచారానికి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నది. రాజకీయ పార్టీలు ప్రజల ఓట్లు దండుకునేందుకు ఇలా చిత్ర విచిత్ర నినాదాలు ఎత్తుకోవడం, తర్వాత అమలు చేయక పోవడం వరుస క్రమంలో జరుగుతుంది. అధికారం కోసం మాత్రమే కాదు, అంతర్గతంగా సహజ సంపదలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి తద్వారా కోట్లాది రూపాయలు దండుకోవడానికి అమలు చేస్తున్న భారీ ప్రణాళిక అని అర్థం చేసుకోవాలి. ఇలాంటి ప్రణాళికల అమలులో అన్ని రాజకీయ పార్టీలది ఒకే ఎజెండా. ప్రశ్నించే వారిని గొంతు నొక్కడం, ప్రలోభాలకు లొంగే మేధావులను అక్కున చేర్చుకోవడం, ప్రతిఘటించే వారి ప్రాణాలు తీయడం మానవ చరిత్ర అంతటా పురావృతం అవుతున్నదే.

దండకారణ్యంలో కాంగ్రెస్ పార్టీ సల్వాజుడుం సృష్టిస్తే, బిజెపి కగార్ ప్రకటించి అమలు చేస్తున్నది .ఎమర్జెన్సీ గురించి అంతా చర్చిస్తున్నారు కానీ, అప్రకటిత ఎమర్జెన్సీ పైన సరైన స్పందన కానరావడం లేదు. అధికారికంగా ప్రకటిస్తే తప్ప సమస్య తీవ్రత అర్థం చేసుకోలేని అసహాయ స్థితిలో పౌర సమాజం కూరుకుపోవడం బాధించే విషయం. మన కళ్ళ ముందే, కేవలం నేరారోపణ చేయబడ్డ కారణంగా పదేళ్ళు అండా సెల్ లో నిర్బంధంచబడి, పూర్తి అనారోగ్యం పాలై మధ్యంతరంగా అసువులు బాసిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి. ఎన్. సాయిబాబా ను మరిచిపోయామా? కేవలం నీరు త్రాగేందుకు స్ట్రా కోసం డిమాండ్ చేసి జైల్లోనే ప్రాణాలు విడిచిన ఫాదర్ స్టాన్ స్వామి గుర్తు లేకుండా పోయాడా? అక్రమ కేసులో ఇరికించబడి నిర్బంధంలో ప్రాణాలు కోల్పోయిన పాండు నరోటే ను ఎందుకు మరిచాం? ప్రశ్నించిన లేదా తేల్చి చెప్పిన బ్రూనో, స్పార్టకస్, సోక్రటీస్ రాజ ద్రోహులుగా గుర్తించబడిన వారే. ఆదివాసుల స్వయం పాలన కోసం పోరాడిన రాంజీ గోండు, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు లాంటి రాజ్యంపై తిరుగుబాటుదారులంతా దేశద్రోహులుగా చిత్రీకరించబడ్డవారే. భగత్ సింగ్, ఆజాద్, సుఖదేవ్ ఇలా ఎందరో నాడు ద్రోహులుగా ప్రకటించబడిన వారే. తర్వాత కాలంలో వీరులుగా గుర్తించబడడం చరిత్రలో సర్వసాధారణంగా జరుగుతున్న విషయమే.దోపిడీ దుర్మార్గాలను ప్రతిఘటించిన వారు, మానవతావాదులంతా పాలకులకంటిలో నలుసులే. అందుకే ఫాసిస్ట్ పాలకులు తాము భయపడుతూ, సమాజాన్ని టెర్రరైజ్ చేసేందుకు ఉద్యమకారులను, విప్లవకారులను పాశవికంగా హత్యలు చేస్తూ శాంతి వచనాలు పలుకుతున్నారు.ఎన్కౌంటర్ లు లేని, ఆత్మ హత్యలు లేని తెలంగాణా కావాలన్న ప్రజల ఆకాంక్షలు ఉద్యమాలు లేకుండా నెరవేరేనా?ఎంతో చైతన్యవంతమైన, సుదీర్ఘ పోరాట చరిత్ర గల తెలంగాణలో పాలకుల ఆటలు కొనసాగడం విషాదకరం

– రమణా చారి

## కిలాడి లేడి వలపు వలకు..బలైన ఎస్ఐ హరీష్



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ ఏటూరునాగారం డిసెంబర్ 5. ముళ్లకట్ట అంతర్రాష్ట్ర వంతెన పక్కనే ఉన్న ప్రైవేట్ రిసార్టులో ఎస్సై హరీశ్ సోమవారం ఉదయం తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గదిలో ఓ యువతి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే రక్తపు మడుగులో విగతజీవి గా ఉన్న హరీశ్ మృతదేహంపై ఓ యువతి పడి రోదించిన ఫొటో లు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఘటన అనంతరం పేరూరు పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసస్టేషన్‌కు తరలించారు. సంఘటన ఎలా జరిగింది? ఆ సమయంలో అక్కడ ఆమె ఎందు కు ఉందనే అంశాలపై విచారించారు. ఈ క్రమంలో పలు విస్తుపోయే విషయాలు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ యువతి సూర్యాపేట జిల్లా వాస్తవ్యురాలిగా గుర్తించారు అక్కడి పోలీసులను సంప్రదించగా సదరు యువతి గతంలో ముగ్గురు యువకులకు ప్రేమపేరుతో దగ్గరై పెళ్లికి ఒత్తిడి చేసి వారు ఒప్పుకోకపోవడంతో కేసులు పెట్టించినట్లు తేలింది. ఈమె వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అతడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆమెపై ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసు నమోదైనట్లు సమాచారం. సమాజంలో పలుకుబడి, ఆర్థికంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని లొంగదీసుకోవడమే పనిగా పెట్టుకున్న ఆ యువతి ఏడాది క్రితం ఎస్సై హరీశ్‌కు ఫోన్‌లో కాంటాక్ట్ అయినట్లు సమాచారం. ఈ క్రమంలో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగి ప్రేమకు దారితీసిందని, అయితే ఆమె గురించి అసలు విషయాలు తెలియడంతో ఆమెతో పెళ్లికి హరీశ్ నిరాకరించాడని సమాచారం. ఈ క్రమంలోనే హరీశ్ కుటుంబసభ్యులు చూసిన సంబంధాన్ని చేసుకునేందుకు అంగీకరించాడని, కానీ తనను పెళ్లి చేసుకోకుంటే రోడ్డుకీడుస్తానని, ఇప్పుడు తాను గర్భవతినని సదరు యువతి హరీశ్‌ను భయపెట్టడంతో తీవ్ర ఆందోళనకు గురైన ఆయన ఎక్కడ పరువుపోతుందోననే బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఎస్సై హరీశ్ మృతిపై తొలుత అనేక ఊహాగానాలు వినిపించాయి. ఉన్నతాధికారుల వేధింపులు, పని ఒత్తిడి అంటూ ప్రచారమైంది. ఈ నేపథ్యంలో ఆయన మరణానికి దారి తీసిన పరిస్థితులను నిగ్గుతేల్చేందుకు పోలీసు అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట యువతి అసలు బండారం బయటపడింది. కాగా, ఆ యువతిని సోమవారం సాయంత్రమే ఇద్ద రు మహిళా కానిస్టేబుళ్లను ఎస్కార్ట్‌గా ఇచ్చి దూద్యా తండాకు తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుశాఖలో ఉజ్వల భవిష్యత్తు ఉన్న హరీశ్ జీవితం విషాదంగా ముగిసిపోవడం కుటుంబసభ్యులను, సన్నిహితులను తీవ్రంగా కలచివేస్తోంది.

# ఆటో, క్యాబ్ డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికై

## డిసెంబర్ 7న ఒక రోజు ఆటో, టాక్సీ, వ్యాన్, క్యాబ్‌లు రాష్ట్ర వ్యాపిత బంద్

**తెలంగాణ రాష్ట్ర ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జేఏసీ పిలుపు**

**తేది:07-12-2024న ఉ?10:30 గంటలకు**

**ప్రదర్శన: సుందరయ్య పార్కు నుండి ఇందిరాపార్కు వరకు ప్రదర్శన అనంతరం బహిరంగ సభ**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుకై తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా, ఆటో, క్యాబ్ డ్రైవర్లు తేది:07%-12-%2024న ఒక రోజు రాష్ట్ర వ్యాపిత బంద్‌ను విజయవంతం చేసి చలో హైదరాబాద్‌కు వేలాదిగా తరలిరావాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, టాక్సీ, క్యాబ్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన ఆటో, క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. గత ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు, ఇతర జిల్లాల ఆటోలు హైదరాబాద్ నగరంలోకి రాకుండా నిషేధించడంలో విఫలమైనది. ప్రస్తుతం ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా, ఎన్నికల మెనిఫెస్టోలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అధికారంలోకి రాగానే, సం?రానికి, రూ.12వేలు ఇస్తామని ప్రకటించడం జరిగినది. అదే విధంగా ఆటో మోటార్‌రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగినది. అయిన ఇప్పటి వరకు ఏలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా, మహిళలకు, ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లందరికి జీవనోపాధిపై పెద్ద దెబ్బతగిలనది. నష్టపోయిన డ్రైవర్లను ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు రవాణా శాఖ మాత్యులు పలు సందర్భాలలో ఆదుకుంటామని చెప్పడం జరిగినది. అయినా గత 12 నెలలు గడుస్తున్నా ఆదుకున్న దాఖలాలు లేవు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతినడం వలన చాలా మంది డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. నష్టపోయిన డ్రైవర్లను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. నష్టపోయిన డ్రైవర్ల పక్షాన ఆటో, క్యాబ్ సంఘాలు అనేకమైన ధర్నాలు ఆందోళనలు చేయడం జరిగినది. హైదరాబాద్ నగరంలో గత 11 సం?రాల నుండి పెరిగిన పెట్రోల్, డీజిల్, ఆయిలు, గ్యాస్, నిత్యావసర ధరలకు అనుగుణంగా ఆటో మీటరు చార్జీలు పెంచవల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. ఈ మీటరు చార్జీలు పెంచకపోవడం వలన డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో మీటర్ చార్జీలు పెంచాలని జేఏసీ డిమాండ్ చేస్తుంది. హైదరాబాద్ నగరంలో 2002లో పొల్యూషన్ పేరుతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో కొత్త ఆటోలకు రిజిస్ట్రేషన్ నిషేధించటం జరిగినది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011 సం?లో, 2013 సం?లో నిరుద్యోగ నిర్మూలన కోసం పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజల రవాణా సౌకర్యం కోసం, కొత్తగా ఆటో పర్మిట్లు ఇచ్చి, పెరిగిన ధరలని నియంత్రించి ఆటో డ్రైవర్లను ఆదుకోవడం జరిగినది. గత కొంత కాలం నుండి హైదరాబాద్ నగరంలో కొత్త ఆటో పర్మిట్లు లేకపోవడం వలన ఆటో డ్రైవర్లు ఎల్‌పిజి, సిఎన్‌జితో కూడిన ఇతర జిల్లాలలో రిజిస్ట్రేషన్ చేయించి కొంత మంది ఫైనాన్సియర్లు, షోరూంలు మధ్య దళారులు హైదరాబాద్‌లో నిబంధనలు ఉన్న ఈ నిబంధనలకు వ్యతిరేకంగా ఎల్‌పిజి, సిఎన్‌జి ఆటోలను హైదరాబాద్‌లో నడుపుతున్నారు. హైదరాబాద్‌లో కొత్త ఆటోలు కొనుక్కోవాలంటే పాత ఆటోను స్క్రాప్ చేసి కొత్త ఆటో కొనుక్కోవాలి. ప్రభుత్వం మరియు ప్రభుత్వ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాలలో రిజిస్ట్రేషన్ అయిన ఆటోలను నిషేధించి, పెరిగిన జనాభాకు అనుగుణంగా హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్‌గా విస్తరించి విశ్వనరంగా వ్యాపించింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా, నిరుద్యోగుల్కైన యువకులకు ఎల్‌పిజి, సిఎన్‌జి, ఎలక్ట్రిక్‌తో కూడిన కొత్త ఆటో పర్మిట్లు ఇచ్చినట్లయితే జీవనోపాధితో పాటు ప్రజల ప్రజా రవాణా సౌకర్యం కలుగుతుంది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆటో పర్మిట్లు ఇచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరుచున్నాము. ఈ క్రింది డిమాండ్లు పరిష్కారం కోసం 2024 డిసెంబర్ 7న ఒక్క రోజు ఆటో, టాక్సీ, క్యాబ్‌లు బంద్ చేసి రాష్ట్ర వ్యాపితంగా ఉన్న ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు చలో ఇందిరాపార్కు వద్ద జరుగు ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర, క్యాబ్ ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ పిలుపు.

### డిమాండ్లు

1. మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వలన నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.
2. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15వేల ఇవ్వాలి.
3. ఆటో & రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
4. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎల్‌పిజి, సిఎన్‌జి, ఎలక్ట్రిక్ కొత్త ఆటోలను ఇవ్వాలి.
5. ఓలా, ఉబర్, రాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్లను నిషేధించాలి.
6. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో మీటర్ చార్జీలు పెంచాలి.
7. ఆటోలకు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి.
8. యాక్సిడెంట్ బీమాను రూ.10లక్షలకు పెంచి, సాధారణ మరణాలకు వర్తింపచేయాలి.
9. 50 సం?రాలు నిండిన ఆటో డ్రైవర్లకు వృద్ధాప్య పించన్లు ఇవ్వాలి.
10. హైదరాబాద్ నగరంలో అక్రమంగా నడుస్తున్న ఎల్‌పిజి, సిఎన్‌జి ఇతర జిల్లాల ఆటోలను పర్మిటు నిబంధనకు అనుగుణంగా వెంటనే నిషేధించాలి.
11. కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలి.
12. ప్రైవేటు ఫైనాన్సియర్ల దోపిడిని అరికట్టాలి.
13. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు ఆటోలకు, క్యాబ్‌లకు పార్కింగు స్థలాలు ఇవ్వాలి.

పైన తెలిపిన డిమాండ్ల పరిష్కారానికే రాష్ట్ర వ్యాపితంగా డిసెంబర్ 7న జరిగే బంద్‌ను జయప్రదం చేసి వేలాదిగా ఇందిరాపార్కుకు తరలిరావల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు.

తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ – తెలంగాణ రాష్ట్ర, టాక్సీ క్యాబ్ జేఏసీ

# కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీట వేస్తుంది: ఎమ్మెల్యే శ్రీ గణేష్..

**– సికింద్రాబాద్ జింఖానా మైదానంలో 2 కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**

కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ 5డిసెంబర్: కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేనస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా సికింద్రాబాద్ జింఖానా క్రీడా మైదానంలో పబ్లిక్ రిప్రజెంటివ్స్ , ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన 2కే రన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దేశవ్యాప్తంగా



సికింద్రాబాద్ జింఖానా మైదానంలో 2కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

ఏకకాలంలో రుణమాఫీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనతో పాటు ఆరు గ్యారెంటీ లను అమలు చేస్తూ జనరంజకమైన పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న మద్దతు చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అనూష,డిపిఆర్ ఓ కలీం,డి వై ఎస్ ఓ సుధాకర్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ క్రీడాకారులతో కాసేపు మాట్లాడారు.

# ప్రభుత్వ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకోవాలి

**చేనేత భీమాకు వయోపరిమితి ఎత్తివేత**
**త్రిఫ్ట్ ఫండ్ పథకంలో ఇక టీం లీడర్ వ్యవస్థ ఉండదు**
**చండూరు సమావేశంలో ఏడి ద్వారక్**

చండూరు: ప్రభుత్వం అందిస్తున్న, అందించబోయే పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ ఏడి ద్వారక్ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం చండూరు చేనేత సహకార సంఘం భవనంలో డిసిసిబి డైరెక్టర్, సహకార సంఘం చైర్మన్ జూలూరు శ్రీను అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం త్వరలోనే ప్రారంభమవుతుందని ఈసారి లీడర్ వ్యవస్థ ఉండదని కార్మికులే నేరుగా ఖాతాలో డబ్బులు జమ చేసుకోవాలని. డబ్బులు సక్రమంగా జమ చేసుకోకపోతే సదర్ కార్మికుడే బాధ్యుడని అన్నారు. త్వరలోనే చేనేత రుణాలు మాఫీ కానున్నయన్నారు. చేనేత భీమాకు వయోపరిమితి సడలించారని, జియో ట్యాగ్ కలిగి ఉండి మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ. 5 లక్షలు వర్తిస్తాయని తెలిపారు. ప్రింటెడ్ చీరలతో తాము నష్టపోతున్నామని కార్మికులు తెలపగా సమస్యల పైన కార్మికులు సంఘటితంగా ముందుకు పోవాలని సూచించారు. మీకు మంచి ఎమ్మెల్యే ఉన్నాడని ఆయన ద్వారా ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందాలని తెలిపారు. అర్హులైన వారందరికీ జియో ట్యాగ్ నెంబర్లు అందజేస్తామని తెలిపారు. సంఘ చైర్మన్ జూలూరు శ్రీనివాసులు మాట్లాడుతూ చేనేత కార్మికులకు 45 ఏళ్లకే పింఛను ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీఎస్టీ రద్దు చేయాలని,రూ.లక్ష రుణమాఫీ తో పాటు 2లక్షల రూపాయలు కొత్తగా రుణాలు అందించాలని ఏడిని కోరారు. ఏడివో గోపాల్ మాట్లాడుతూ ఇప్పటివరకు అమలైన పథకాలకు ఎంత మంది లబ్ధి పొందారు ఏ పథకాల అమలు చేసింది వివరించారు. పలువురు నాయకులు, కార్మికులు మాట్లాడుతూ అర్హులైన వారికి


చండూరు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ ఏడి ద్వారక్.

జియో ట్యాగ్ ఇవ్వాలని అలాగే అనుబంధ కార్మికులకు కూడా జియో టాగ్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ప్రింటెడ్ చీరలను అరికట్టాలని కోరారు. స్టాండ్ మగ్గాలు ఇతర పరికరాలను అందజేయాలని కోరారు. కళ్యాణ లక్ష్మి పథకంలో చేనేత చీరలను ఇవ్వాలని కోరారు. రైతులకు మాదిరిగానే మద్దతు ధరతోని చీరలు కొనుగోలు చేసే ప్రయత్నం చేయాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివో ప్రసాద్, మేనేజర్ తిరందాసు బిక్షమయ్య, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రం బిక్షమయ్య, గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న, ఉభయ దేవాలయాల ట్రస్ట్ కమిటీ చైర్మన్ కోమటి వీరేశం, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, సంఘ డైరెక్టర్లు చిట్టిపోలు వెంకటేశం, రావిరాల ఓంకారం కార్మిక సంఘం అధ్యక్షుడు రాపోలు వెంకటేషం, చేనేత పరిరక్షణ సేవా సమితి ఫౌండర్ రాపోలు ప్రభాకర్, అధ్యక్షుడు చెరుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలపై రాజకీయాలు చేయవద్దు : ఎమ్మెల్యే శ్రీ గణేష్..

**– భక్తుల మనోభావాలకు అనుగుణంగానే ప్రభుత్వం వ్యవహరిస్తుంది.**

కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ : కంటోన్మెంట్ లోని తాడ్ బండ్ ఆలయంలో ప్రతి శనివారం జరిగే కార్యక్రమాలు యధావిధిగా జరుగుతాయని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలే కరుల ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనంతరం కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్ మాట్లాడుతూ... తాడ్ బండ్ హనుమాన్ దేవాలయంలో ప్రతి శనివారం జరిగే పూజలకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతాయని తెలిపారు. కొంత మంది రాజకీయ శక్తులు దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని రాజకీయాలు చేయడం మానుకోవాలని, అలాంటి వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ప్రతి శనివారం రాత్రి తొమ్మిది గంటల నుండి 1:00 వరకు జరిగే భజన సత్సంగ కార్యక్రమాల విషయంలో పుష్పగిరి పీఠాధిపతి అభ్యంతరాలు తెలపగా అభిప్రాయ సేకరణ చేసే క్రమంలోనే ఈ విషయం భక్తుల వరకు చేరడంతో భక్తులు అపోహలకు గురయ్యారని అన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగానే ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆలయంలో జరిగే కైంకర్యాలు యధావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు. దేవాలయాల విషయంలో రాజకీయం చేస్తున్న


తాడ్ బండ్ హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

వారిపై సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎండోమెంట్ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ మాట్లాడుతూ ....భక్తుల మనోభావాలు దెబ్బతీయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదని, కొంతమంది వ్యక్తులు చేస్తున్న ప్రచారాన్ని భక్తులు నమ్మకూడదని ఆయన తెలిపారు. ఆలయంలో గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న సాంప్రదాయాలను ప్రభుత్వం గౌరవిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నరేందర్, నాయకులు సంకి రవీందర్, తేలు కుంట సతీష్ గుప్తా, సి. సంతోష్ యాదవ్, బద్దం బల్వంత్ రెడ్డి, ముప్పిడి మధుకర్, సురవి శ్యాంసుందర్ రెడ్డి, జగ్గం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ లో బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

- డ్రైవర్ ల సమస్యల పరిష్కారం కొరకు భారీగా తరలి రండి
- ఎండి ఉమర్ ఖాన్ పిలుపు

సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ : ఆటో, క్యాబ్, ట్యాక్సి డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 7 న ఇందిరా పార్కు వద్ద జరిగే బహిరంగ సభ పోస్టర్ ను సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాండ్ ఏ ఐ టి యు సి ఆటో స్టాండ్ వద్ద ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఉమర్ ఖాన్ మాట్లాడుతూ ఆటో, ట్యాక్సి, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల07 న ఉదయం 10:30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్కు వరకు భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ ఉంటుందని, భారీగా తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఎం డి ఉమర్ ఖాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆటో యూనియన్ ఆటో యూనియన్ జాయింట్ సెక్రెటరీ హరి దర్శన్ (లడ్డు),పి కృష్ణ, శ్రీనివాస్,



అలిముద్దీన్, చంద్ర శేఖర్, రాంబాబు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం

నర్సంపేట తెలంగాణ లిమదర్స్ లాండ్ హై స్కూల్ యందు మదర్స్ లాండ్ పాఠశాల చైర్మన్ పాశికంటి రమేష్ గారి అధ్యక్షతన నర్సంపేట పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల బాధ్యులను ఘనంగా సన్మానించడం జరిగింది. వారు మాట్లాడుతూ.... సమాజానికి ఉపయోగ పడే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నర్సంపేట స్వచ్ఛంద సంస్థల భద్యుల కృషి అమోఘమని అన్నారు.. మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహించడం,పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, సింగిల్ యుజ్ ప్లాస్టిక్ పై అవగాహన ,బాలల అక్రమణ రవాణా లను అరికట్టడం,గ్రంథాలయాల ఏర్పాటుచేయడం, పిల్లలకు గ్రహణ మొర్రి కి ఉచితంగా ట్రీట్మెంట్ ఇప్పించడం, లాంటి కార్యక్రమాలు ఈ యొక్క సంస్థల భద్యులు నిర్వహించడం అనిర్వచనీయమైన స్కూల్ ఛైర్మెన్ పాశికంటి రమేష్ అన్నారు... కార్యక్రమం లో.. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గిరిగాని సుదర్శన్, బెజ్జంకి ప్రభాకర్,కోట డేవిడ్, మైస వసంత, ఎర్రబోయిన రాజశేఖర్, కాసుల రవికుమార్ లు పాల్గొన్నారులి



# శ్రీ రామాలయం నూతన ఆలయము కు మంత్రులు సీతక్క సురేఖ అక్క సహకారం

కొత్తగూడ తెలంగాణ సేన మహబుబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో వెలసిన శ్రీ రామ ఆలయం నిర్మాణ స్థలం. పనుల కోసం దేవాదాయ శాఖ నుండి నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కు విజ్ఞప్తి చేశారు. తన అధికారిక లెటర్ ద్వారా నిధుల కోసం రిక్వెస్ట్ చేసారు. అందుకు సహకరించిన మంత్రి సీతక్క తనయుడు సూర్య, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ లకు లిశ్రీరామాలయ సాధన సమితి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు



# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

కొత్తగూడ తెలంగాణ సేన: గంగారం మండలంలోని పునుగొండ్ల గ్రామానికి చెందిన ఈక వెంకటమ్మకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయ చెక్కును గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు మంత్రి సీతక్క వారి ఆదేశాలకు ఈక వెంకటమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 60 వేల రూపాయలు చెక్కును అందజేశారు ఈ కార్యక్రమంలో మండల శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనక పురుషోత్తం మాజీ సర్పంచ్ చెరుకుల కాంతారావు మండల యువత నాయకులు గుమ్మడి ప్రవీణ్ కుమార్ మహిళా నాయకులు మోకల సులోచన పెనక సాంబ లక్ష్మి పెనక సారక్క పెనక వెంకటలక్ష్మి పాల్గొన్నారు



# అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా దివ్య పడిపూజ

**మణికంఠ స్వామికి అభిషేకాలు**

నర్సంపేట తెలంగాణ సేన 22 వ మహా అన్నదాన ప్రసాద మహోత్సవంలో దివ్య పడిపూజ పుష్పాభిషేకం మాల్యాల యశ్వంత్ జన్మదినం మహా కనకాభిషేకం స్థానిక నర్సంపేట పట్టణం యందు 5 డిసెంబర్ 25 గురువారం రోజున శ్రీ శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప దేవాలయ ప్రాంగణం యందు ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు దేవీష్ మీశ్రా పూజ నిర్వహణలో ఆలయ అధ్యక్షులు సైఫా సురేష్ ఆలయ కమిటీ చేతుల మీదుగా దివ్య పడిపూజ పుష్పాభిషేకధాత యశ్వంత్ జన్మదిన సందర్భంగామల్యాల అనసూర్య కీర్తిశేషులు యాదగిరి దంపతుల కుమారులు మల్యాల రాజు లత, మల్యాల ప్రవీణ్ సాగరిక, బజ్జూరి మంజుల శ్రీనివాస్, తనుషా ప్రియతమ్ సాన్విత లు నూతన వస్త్రాలు ధరించి స్వామివారి పంచలోహ విగ్రహాన్ని శిరస్సై ధరించి పొదినెట్టాం వారిపై ఆశన్నం చేయగా 18 కలుశాలపై దాతల కోరిక మేరకు ధర్మశాస్త్ర అయ్యప్పకి నిష్టతో ఏకాగ్రతతో పూజలు నిర్వహించగా స్వామివారికి తేనె పాలు పెరుగు ఖర్జూర చెర్రీస్ పంచామృతం బెల్లం ఒక రూపాయి నాణెములతో కనుక అభిషేకం అంగరంగ వైభవంగా అభిషేకంతో మాలదర స్వాములకి నైవేద్యం అన్న ప్రసాద వితరణ చేయగా పూజలో పాల్గొన్న ప్రతి భక్తుడికి అభిషేకం



చేసిన ఒక రూపాయి నాణెము వితరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలో గుర్తింపు కలిగిన ఉత్తమ సేవకులు గా గుర్తిస్తూ దాత కుమారుడు మల్యాల యశ్వంత్ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ అమెరికాలో పై చదువులతో పాటు ఉద్యోగరీత్యా అంచలంచలుగా ఎదుగుతూ ఆలయ దాతృత్యంలో ముందుండాలని కోరారు

దాతలు మల్యాల రాజు కుటుంబ సభ్యులను అభినందిస్తూ దాతలకి పుష్పాలు మరియు పట్టువస్తులతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా సైఫా సురేష్ చింతల కమలాకర్ రెడ్డి దొడ్డ రవీందర్ గుప్తా మాదారపుచంద్రశేఖరం గుప్తా, శ్రీరాం ఈశ్వరయ్య, వంగేటి గోవర్ధన్ గుప్తా చేకిలం కృష్ణమూర్తి శ్రీరాముల శంకరయ్య,అనంతుల రామ్ నారాయణ, పాలకుర్తి శ్రీనివాస్, వజినే పెల్లి శ్రీనివాస్, శింగిరికొండ వేణుగోపాల్, పిన్న రామనాథం, దొడ్డ వేణు మనోహర్, కార్తీక్ భరత్, ఆలయ కమిటీతో అర్చకులు గురుస్వాములు గందె సంజీవరావు, మర్రి యాదగిరి రాయ సాఫ్ నాగరాజు అంకుస్ లతోపాటు గుమస్తా దేశము పూల శ్రీధర్ మర్రి రాజు వంటశాల బృందం బిక్షపతి గోపి సుమన్ లక్ష్మి లతోపాటు దాతల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పలు గ్రామాల భక్తులు మాలదరస్వాములు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# గజ్వేల్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా బైరం రమేష్

యూత్ కాంగ్రెస్ గజ్వేల్ మండల ఉపాధ్యక్షుడిగా గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు బైరం రమేష్ ఎన్నికయ్యారు ఇటీవల నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గజ్వేల్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా బైరం రమేష్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా గురువారం గజ్వేల్ లో బైరం రమేష్ మాట్లాడుతూ ముందుగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, అలాగే నా మీద నమ్మకంతో యూత్ కాంగ్రెస్ గజ్వేల్ మండల ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు




# సమస్యపై స్పందించిన కార్పొరేటర్ రాసూరి సునీత

సికింద్రాబాద్,తెలంగాణ సేన న్యూస్: మెట్టుగూడ డివిజన్ దూద్ బాయి పార్థి బస్తీలో తాగునీటి పైప్ లైన్ ద్వారా కలుషితమైన నీరు సరఫరా అవుతుందని బస్తీ వాసులు కార్పొరేటర్ రసూరీ సునీత దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన హెచ్ ఎండబ్ల్యూ ఎస్ ఎస్ బి అధికారులతో కలిసి బస్తీని సందర్శించి, సమస్యను తెలుసుకొని రెండు రోజుల్లో పైప్ లైన్ ను మారుస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.



# రేవంత్ రెడ్డి ప్రభుత్వం యూటర్న్ ప్రభుత్వం ఎన్ సీ సంతోష్

రేవంత్ రెడ్డి ప్రభుత్వం యూటర్న్ ప్రభుత్వం అని బి ఆర్ ఎస్ యూత్ వింగ్ నాయకుడు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ అన్నారు గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర పాలనపై తీవ్ర విమర్శలు చేసారు. ఈ సంవత్సర కాలంలో కాంగ్రెస్, యుూటర్న్ ద్వంద వైఖరి, మోసపూరితమైన హామీలు నిస్సందేహమైన అబద్దాలతో ప్రజలను తెలంగాణను తప్పు త్రోవ పట్టించారాని, మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలె ప్రజా భవన్ పేరు పెట్టి ఓకే ఒక్కరోజు ప్రజా భవన్ కి వెళ్లి ప్రజా పాలనలో యూటర్న్ ,నాకు కాన్వాయ్ అవసరం లేదు నేను మీలో ఒకడినే అన్న ముఖ్యమంత్రి మాటకు యూటర్న్, ముచర్లలో 14 వేల ఎకరాల ఫార్మసిటీ ఫ్యూచర్ సిటీ విషయం లో యూటర్న్, లగచర్ల ఫార్మసిటీ విషయంలో అది ఫార్మ కాదు ఇండస్ట్రియల్ కారిడర్ అని యూటర్న్, ఆదానికి 100కోట్లు రిటర్న్ ఇచ్చేయడంలో యుూటర్న్, 6 గ్యారంటీలు 13హామీల విషయంలో యూటర్న్, హైడ్రా ఏర్పరిచి పేదవారి ఇండ్లను కూలగొట్టి అన్న తిరుపతి రెడ్డి ఇంటి



విషయానికి వచ్చేసరికి యూటర్న్,రేషన్ కార్డు ల విషయంలో యూటర్న్, రెండు లక్షల జాబుల విషయంలో యూటర్న్, పెన్షన్స్ వవిషయం లో యూటర్న్ మహిళలకి నెలకి 2500/- రూపయాల విషయంలో యూటర్న్ రుణమాఫీ విషయంలో దేవుళ్ళ సాక్షిగా మోసం,బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే ల ఇంటికి వెళ్లి వారిని కాంగ్రెస్ లో చేర్చుకొని అది కాంగ్రెస్ కండువా కాదు దేవుని కండువా అని చెప్పించి కోర్ట్ ని ప్రజలని తప్పుద్రోవ పట్టే విధంగా అబద్దం. ఇలా ప్రతి విషయంలో తెలంగాణ ప్రతిష్ట దిగజర్చే విధంగా తెలంగాణ ప్రజలు ఆర్థికంగా కోలుకోలేని విధంగా చెర్యలు చెబేట్టుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం రాక్షస పాలనని తలపిస్తుంది అని అన్నారు, ప్రశ్నించే ప్రతిపక్షాలను అరెస్టు చేస్తా అనే ఆలోచన మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు

తెలంగాణ సేన



# ఆనాడు రేవంత్ రెడ్డిని చిన్న కేసులో అరెస్ట్ చేశారు

-మొదటిపేజీ తరువాయి

చేసుకునేలా చేశారని విమర్శించారు. కేటీఆర్‌కు కామన్ సెన్స్ లేదన్నారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చిన్న డ్రోన్ కేసులో కక్షపూరితంగా అరెస్ట్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయాక కార్యకర్తలు గుర్తుకువస్తున్నారని విమర్శించారు.

హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని గంధపు చెక్కల వ్యాపారి అంటూ ఒక బీఆర్ఎస్ నాయకుడు అగౌరవంగా మాట్లాడారని మండిపడ్డారు. కోమటిరెడ్డి సోదరుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ వారికి లేదన్నారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి రాజీనామా చేశారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. అసెంబ్లీకి రాని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారని ప్రశ్నించారు. కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలన్నారు.

**అవన్నీ బీఆర్ఎస్ నేతల భ్రమలే..**

రేవంత్‌పై కేటీఆర్ పిచ్చి కూతలు కూస్తున్నారని.. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వస్తుందని తెలిశాక కేటీఆర్, కవిత తట్టాబుట్టా సర్దుకొని ఉద్యమంలోకి వచ్చారని వ్యాఖ్యలు చేశారు. రేవంత్



సక్సెస్ వెనక ఎంత శ్రమ ఉందో తెలుసుకోవాలన్నారు. ప్రతి దానికి రేవంత్‌పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కులాలపై సూక్ష్మంగా ఆలోచిస్తూ వారి ఎదుగుదల కోసం రేవంత్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు ఫాం హౌస్‌లో పడుకున్నారని విమర్శించారు. కేటీఆర్ మీడియా ముందు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు కడుపునిండా తిని, కంటి నిండా నిద్రపోయారని బీఆర్ఎస్ నాయకులు భ్రమ పడుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని.. అందుకే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ ఉచ్చులో విద్యార్థులు పడొద్దని హితవుపలికారు. గతంలో పెట్రోల్ క్యాన్ తెచ్చుకొని అగ్గిపెట్టె మర్చిపోయారని.. ఇప్పుడు పెట్రోల్ క్యాన్ తెచ్చుకుంటే అగ్గిపెట్టెలు బీఆర్ఎస్ కార్యకర్తలే తెచ్చుకుంటారంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు.

**వారివి ఉత్తుత్తి రాజీనామాలు...**

అలాగే బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిపై కూడా మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి గంధపు చెక్కల బిజినెస్ మడత పెట్టుకోవాలన్నారు. సహచర మంత్రిని తిట్టినందుకే రెస్పాండ్ కావాల్సి వస్తుందన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేపై మాట్లాడాలంటే తన స్థాయి తగ్గుతుందంటూ వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రజలపై ఎంత ప్రేమ ఉంటుందో అందరికీ తెలుసన్నారు. ఉద్యమంలో బీఆర్ఎస్ నేతలు ఉత్తుత్తి రాజీనామాలు చేశారని.. తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారని చెప్పుకొచ్చారు. పోటీ చేసిన అభ్యర్థిని కలెక్టర్‌కు పరిచయం చేస్తే తప్పా అని ప్రశ్నించారు. "హుజూరాబాద్ పిచ్చోడు అసెంబ్లీలో అరుస్తాడు. అసెంబ్లీలో హుజూరాబాద్ ఎమ్మెల్యే చప్పట్లు కొట్టి డ్యాన్సులు చేస్తాడు. కౌశిక్ రెడ్డి చిన్నపిల్లల కంటే దారుణంగా మాట్లాడుతున్నాడు" అంటూ దుయ్యబట్టారు.

**తెలంగాణ తల్లి విగ్రహంపై..**

రేవంత్ రెడ్డిని అరెస్టు చేసినట్టు తాము అరెస్టు చేయాలనుకుంటే బీఆర్ఎస్ నేతలంతా జైల్లో ఉండేవాళ్ళన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో బీఆర్ఎస్ నేతల హస్తం లేకపోతే ఆఫీసర్లను దేశం ఎందుకు దాటించారని ప్రశ్నించారు. చేసేది న్యాయమే అయితే సోషల్ మీడియాను వేరే దేశం నుంచి నడపాల్సిన అవసరం ఏంటని నిలదీవారు. అలాగే "యూ ట్యూబ్‌లో జరిగిన దానిపై మేం కొంత దూకుడుగా ఉండాల్సింది. మా వైఫల్యం కొంత ఉంది" అని తెలిపారు. తెలంగాణ తల్లిని దొరసాని లాగా చేశాని.. తెలంగాణ తల్లిని కవిత లాగా తయారు చేశారన్నారు. బంగారు ఆభరణాలు, వడ్డాణాలు పెట్టి తెలంగాణ తల్లిని తయారు చేశారని అన్నారు. సబ్బండ వర్గాల ప్రతినిధిగా తెలంగాణ తల్లిని తయారు చేస్తామని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు.

# త్వరల్లో భారీగా బదిలీలు?

-మొదటిపేజీ తరువాయి

ఉంటాయంటున్నారు. ఈ నేపథ్యంలో ఏ అధికారికి ఏం పోస్ట్ దక్కబోతుంది.? ఇప్పుడున్న పోస్ట్ కంటే తక్కువ పోస్ట్‌కు వెళ్లేదెవరు.? ఏ అధికారి అందలమెక్కబోతున్నారు.? లూప్ లైన్‌లోకి వెళ్లేదెవరనే చర్చ సెక్రటేరియట్‌లో హాట్ టాపిక్ మారిందిసమీక్షల్లో సీఎం ఓ డైరెక్షన్‌లో ఆర్డర్స్ ఇస్తే ఔట్ పుట్ మాత్రం ఇంకోలా వస్తుందని భావిస్తున్నారట ప్రభుత్వ పెద్దలు. ప్రభుత్వంపై ప్రజల్లో అనుకున్నంత సానుకూలత లేకపోవడానికి అధికారుల తీరే కారణమన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ హయాంలో పనిచేసినట్లు పలువురు అధికారులు సమర్ధవంతంగా పనిచేయడం లేదన్న టాక్ వినిపిస్తోంది. సీఎంవోతో పాటు పలు శాఖల్లో ఉన్నతాధికారులు సమర్ధవంతంగా పనిచేయడం లేదట. ఏదైనా అడిగితే ఏదో కారణం చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారట. ఇదే సీఎం రేవంత్ రెడ్డికి ఆగ్రహం తెప్పించిందంటున్నారు. అందుకే అందరినీ మార్చేయండి..పనిచేసే వాళ్లనే కీలక శాఖల్లో పెట్టండి అంటూ ఆర్డర్స్ ఇచ్చేశారట ముఖ్యమంత్రి.ప్రభుత్వం ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు దృష్టి పెట్టడం లేదట. కొత్తగా ఆదాయం పెంపు సంగతి పక్కన పెడితే..రెగ్యులర్‌గా ప్రభుత్వానికి వచ్చే ఆదాయమే పడిపోయిందట. అయినా



అధికారుల్లో చలనం కనిపించడం లేదని ప్రభుత్వ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక నిర్మల్ జిల్లాలోని ఇథనాల్ ఫ్యాక్టరీ వివాదం విషయంలో కూడా అధికారులు ప్రభుత్వాన్ని ముందే అలర్ట్ చేయలేదంటున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం.కానీ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా స్థానికులతో కలిసి ఉద్యమం చేసింది అదే బీఆర్ఎస్ పార్టీ. కానీ ఈ విషయాలను ఉన్నతాధికారులెవరు ప్రభుత్వం దృష్టికి తీసుకురాలేదట. దీంతో చివరికి ఇథనాల్ ఫ్యాకరీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అధికారులు పట్టనట్లు వ్యవహరించడం వల్లే..ప్రభుత్వం బద్నాం కావాల్సి వస్తుందని భావిస్తున్నారట ప్రభుత్వ పెద్దలు.ఇక లగచర్ల ఘటన కూడా అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందన్న టాక్ వినిపిస్తోంది. భూసేకరణ విషయంలో ముందుచూపుతో వ్యవహరించకుండా..కలెక్టర్‌పై దాడి జరిగే వరకు వ్యవహారం వెళ్లింది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని, ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి ఉంటే సర్కార్ వెనకడుగు వేయాల్సి వచ్చేది కాదంటున్నారు.ఇదే క్రమంలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ విషయంలోనూ అధికారుల నిర్లక్ష్యం ఉందన్న అభిప్రాయంలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నారట. ఒక ఘటన జరగ్గానే వెంటనే రియాక్ట్ అయి చర్యలు తీసుకుంటే ఇష్యూ పెద్దది అయ్యేది కాదని..కానీ తమకెందుకులే అన్నట్లుగా వ్యవహరించడం వల్లే పరిస్థితి చేయిదాటిపోయే వరకు వచ్చిందంటున్నారు. వీటన్నింటికీ ప్రభుత్వ నిర్ణయాలు ఓ కారణమైతే..అధికారుల పనితీరు సరిగ్గా లేకపోవడమే కారణమన్న టాక్ వినిపిస్తోంది.ఇప్పటివరకు జరిగిన డ్యామేజ్ జరిగిపోయింది. ఇక రెండో ఏడాదిలో అయినా అన్ని లక్ష్యాలను సాధించాలని ఫిక్స్ అయిపోయిందట రేవంత్ సర్కార్. అందుకే బాధ్యతాయుతంగా పనిచేయని అధికారులను ఉపేక్షించొద్దని..ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చుకునే బదులు..మరో అధికారితో పనిచక్కబెట్టుకోవాలని భావిస్తున్నారట ప్రభుత్వ పెద్దలు. ఏ అధికారి బదిలీ అవుతారో..ఎవరికి లూప్ లైనే దిక్కవుతుందో చూడాలి మరి.

# పార్టీల మధ్య గీతం
# తెలంగాణ తల్లి విగ్రహం లొల్లి

**హైదరాబాద్ :** రాష్ట్రానికి అయినా రాష్ట్ర గీతం ఒకటే ఉంటుంది. ఆరాధించే తల్లి కూడా ఒకటే ఉంటుంది. కానీ తెలంగాణకు వచ్చేసరికి సీన్ మారుతోంది. మీ తల్లే మీదే..మా తల్లి మాదే. మీ గీతం మీదే..మా గీతం మాదే అన్నట్లుగా ఉంది పరిస్థితి. ప్రభుత్వం చెప్పిన మాట అపోజిషన్ వినదు. అప్పటి ప్రభుత్వం రూపొందించిన వాటిని ఇప్పటి ప్రభుత్వం ఒప్పుకోదు. దీంతో రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా లొల్లి కంటిన్యూ అవుతోంది. ఇంతకీ రెండు తల్లులు, రెండు రాష్ట్ర గీతాల లొల్లి పతాకస్థాయికి చేరింది

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం..రాష్ట్ర చిహ్నం, రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్‌పై టీఎస్ అని పెట్టేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ కథ మొదటికి వచ్చింది. అధికారి పార్టీ తెలంగాణ తల్లిని ఓ రూపంలో కొలుస్తుంటే..అపోజిషన్ బీఆర్ఎస్ తాము ముందుగా రూపొందించిన తెలంగాణ తల్లినే ఆరాధిస్తుంది. ఇక రాష్ట్ర గీతం పరిస్థితి కూడా అంతే. జయజయహే తెలంగాణ విషయంలోనూ ఎవరి గీతం వారిదే అన్నట్లు అయిపోయింది సిచ్యువేషన్.మీ బీఆర్ఎస్ తల్లి మీదే, మా కాంగ్రెస్ తల్లి మాదే అన్నట్లుగా మరో తెలంగాణ తల్లి విగ్రహం సిద్ధం చేయిస్తున్నారు సీఎం రేవంత్. కేసీఆర్ తయారు చేయించిన తెలంగాణ తల్లి విగ్రహంలో ఆయన కూతురు కల్వకుంట్ల కవిత పోలికలు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి విమర్శించే వారు. తెలంగాణ తల్లి అంటే గడిలో ఉండే రాణీగారు కారని, రాష్ట్రంలో సామాన్య ప్రజలకు ప్రతీకగా ఉండాలంటూ చెప్పుకొచ్చారు. అప్పుడు మాట్లాడినట్లుగానే ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మారుస్తున్నారు. డిసెంబర్ 9న సెక్రటేరియట్‌లో కొత్త రూపంలో తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసేందుకు రెడీ అవుతోంది ప్రభుత్వం. ఇప్పటికే విగ్రహ తయారీ క్లైమాక్స్‌కు చేరుకున్నట్లు తెలుస్తోందితెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని



మార్చడంపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్న రేవంత్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తున్నారు గులాబీ నేతలు. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ విగ్రహాన్ని మారుస్తున్నారని మండిపడుతున్నారు. కొత్త తెలంగాణ విగ్రహంలో సోనియా గాంధీ రూపం కనిపిస్తోందని విమర్శిస్తోంది బీఆర్ఎస్. ఈ క్రమంలోనే డిసెంబర్ 9న కొత్త రూపంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టబోతున్నారు సీఎం రేవంత్. బీఆర్ఎస్ మాత్రం తాము మొదటి నుంచి ఆరాధిస్తున్న తెలంగాణ విగ్రహ రూపాన్నే అదే రోజు మేడ్చల్‌లో ఏర్పాటు చేస్తామంటోంది. ఇలా ఎవరి తల్లి వారిదే అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. బీఆర్ఎస్ హయాంలో రూపొందించి తెలంగాణ తల్లి రూపాన్ని కాంగ్రెస్ సర్కార్ ఒప్పుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం డిజైన్ చేస్తున్న కొత్త తెలంగాణ తల్లి రూపాన్ని బీఆర్ఎస్ ఒప్పుకోవడం లేదు.

ఇలా ఎవరికి తోచినట్లుగా వారు తెలంగాణ తల్లిని ఆరాధిస్తున్నారు.రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ విషయంలోనూ ఇదే రచ్చ జరుగుతోంది. పాత పాటనే తమ పార్టీ సమావేశాల్లో ఆలపిస్తూ వస్తోంది బీఆర్ఎస్. కాంగ్రెస్ నేతలు మాత్రం తాము అధికారంలోకి వచ్చాక మార్చిన గీతాన్ని ఫాలో అవుతున్నారు. వాహనాల నెంబర్ల ప్లేట్‌పై టీఎస్, టీజీ విషయంలోనూ ఎవరూ తగ్గడం లేదు. తెలంగాణ రాష్ట్ర చిహ్నం మార్చినప్పుడు కూడా బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా ఎవరూ తగ్గడం లేదు. పదేళ్లు ఓ రూపంలో తెలంగాణ తల్లిని, గీతాన్ని ఆలపించిన జనాలకు ఇప్పుడు కొత్త తల్లి, కొత్త గీతం అందుబాటులోకి తేవడం ఏంటన్న చర్చ తెరమీదకు వస్తోంది. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా తెలంగాణ తల్లి, రాష్ట్ర గీతం మీద ఈ పంచాయితీ ఏంటని ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలకు పోయి రాష్ట్ర పరువు తీస్తున్నారని మండిపడుతున్నారు ఉద్యమకారులు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్ల పాలన పూర్తయ్యాక..ఇప్పుడు ఎవరి తల్లి వారిదే..ఎవరి గీతం వారిదే అని నడుచుకుంటూ వెళ్తే ఎలా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఊరూరా పాత తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయి. వాటి పరిస్థితి ఏంటని అడుగుతున్నారు. ఏ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఫాలో కావాలి..ఏ గీతాన్ని ఆలపించాలో సాధారణ ప్రజలకు అర్థం కావట్లేదని..ఈ కన్ఫ్యూజన్‌కు ఎండ్ కార్డ్ వేయాలని కోరుతున్నారు. తెలంగాణ తల్లి, రాష్ట్ర గీతంపై అధికార, విపక్షాల పట్టుదలలు ఎంతవరకు వెళ్తాయో చూడాలి మరి.

## కేసీఆర్ గారూ... అసెంబ్లీకి రండి

-మొదటిపేజీ తరువాయి

సూచనలు ఇవ్వండని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

**మీ పిల్లలు తప్పు చేస్తే సర్ది చెప్పాలి**

కుటుంబ పెద్దగా మీ పిల్లలు (బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి) తప్పు చేస్తే వారికి సర్ది చెప్పాలని సూచించారు. కేసీఆర్ సభకు వచ్చి పెద్దరికాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కేసీఆర్ ఇష్టపడ్డా... లేకున్నా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంచి సంప్రదాయం ఉండేదని, సభలో కొన్ని అంశాలపై చర్చించి ఆ తర్వాత ప్రజల సమస్యలపై ప్రత్యక్షంగా అప్పటి మంత్రులను కలిసి... నిధులు రాబట్టుకునే వాళ్లమని గుర్తు చేసుకున్నారు.

కానీ తెలంగాణ వచ్చాక గత పదేళ్లు అలాంటి అవకాశం లభించలేదన్నారు. కనీసం సీఎం సచివాలయానికి కూడా రాలేదన్నారు. ప్రజలు అన్నీ గమనించి బీఆర్ఎస్‌ను అధికారానికి దూరం చేశారన్నారు. ఇప్పటికైనా వారి ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. మీ పిల్లలిద్దర్నీ మా పైకి ఉసిగొల్పి ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించారు. తాము ఎవరినో నిందించుకుంటూ కాలం గడపడం లేదని... ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వెళుతున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి రిప్రజెంటేషన్ ఇచ్చి సమస్యలపై చర్చించే వారని, వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు కూడా అదే తరహాలో ప్రభుత్వానికి సూచనలు చేశారన్నారు. లోపాలను సరిదిద్దుకోవాలని ప్రతిపక్షాలు చెప్పాలన్నారు. కానీ వారు సభకే రావడం లేదన్నారు. ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని, దీనికి సంబంధించి ఏమైనా సూచనలు ఉంటే అక్కడ చెప్పాలన్నారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారికే ప్రభుత్వం ఇల్లు చెందాలనేది తమ లక్ష్యమన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

-మొదటిపేజీ తరువాయి

కేసు విచారణ సందర్భంగా భోజనం వికటించిన ఘటనల్లో ప్రభుత్వం రెండు కమిటీలు ఏర్పాటు చేసిందని ధర్మాసనానికి ఏఏజీ వివరణ ఇచ్చారు. ఈ ఘటనల్లో బాధ్యులైన వారిని ఇప్పటికే సస్పెండ్ చేశామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఏజెన్సీలకు చెల్లించే డబ్బులను 40శాతం పెంచినట్లు తెలిపారు. పిటిషర్ తరఫున సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ప్రధానమంతి పోషణ్ పథకం కింద గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు ఉండాల్సి ఉందని.. కమిటీల పర్యవేక్షణ సరిగా లేపకపోవడం వల్లే భోజనం వికటించే ఘటనలు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కమిటీలు సరిగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనికి ఏఏజీ కమిటీ అన్ని బాగానే పని చేస్తున్నాయని బదులివ్వగా.. హైకోర్టు వివరాలను నమోదు చేసుకున్నది.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ మాజీ ఎంపీ

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ సమక్షంలో చేరిక**

**కాంగ్రెస్ కండువా కప్పుకున్న బీఆర్ఎస్ నేత ఆత్రం సక్కు**

**అదే బాటలో బీజేపీ మాజీ ఎంపీ సోయం బాపురావు**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీజేపీ మాజీ ఎంపీ సోయం బాపురావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో వారు అధికార పార్టీలో చేరారు. ఆత్రం సక్కు 2009, 2019లో ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఈ రెండు పర్యాయాలు కూడా ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచే విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. గత లోక్ సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ చేతిలో ఓడిపోయారు. ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నేత సోయం బాపురావు 2019లో బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచారు. 2024లో బీజేపీ గోడం నగేశ్‌కు టిక్కెట్ ఇచ్చింది. ఆయన అప్పటి నుంచే అసంతృప్తితో ఉన్నారు. తాజాగా ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో పార్టీ కార్యాలయంలో వారు కాంగ్రెస్ జెండా కప్పుకున్నారు. మహేశ్ కుమార్ గౌడ్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

## రేవంత్ రెడ్డి మీ పాలన మార్పు మార్కు ఇదేనా...



**హైదరాబాద్:** బీఆర్ఎస్ సీనియర్ నేత , మాజీ మంత్రి హరీష్‌రావు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఒక ప్రజాప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేసేందుకు వెనుకడుతరు, మళ్ళీ ఉల్టా కేసు బనాయిస్తరు.. ఇదేం విడ్డూరం... ఇదెక్కడి న్యాయం.. ఇదేం ప్రజాస్వామ్యం.. రేవంత్ మీ పాలన మార్పు మార్కు ఇదేనా.. రాజ్యాంగాన్ని కాపాడుదామని రాహుల్ గాంధీ గారు రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరుగుతడు... నువ్వేమో తెలంగాణలో అడుగడుగునా రాజ్యాంగ ఉల్లంఘన చేస్తూనే ఉంటవు... ప్రజల తరుపున పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడతామంటే అదిరేది లేదు, బెదిరేది లేదు" అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజాక్షేత్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని, వెంట పడుతూనే ఉంటామని హరీష్ రావు స్పష్టం చేశారు.

**ఉద్రిక్తత**

మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిదగ్గర పోలీసుల మోహరించారు. కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీస్ అధికారుల విధులకు ఆటంకం కల్గించారంటూ కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైంది. ఇదిలా ఉండగా మరి కాసేపట్లో కౌశిక్ రెడ్డి నివాసానికి మాజీమంత్రి హరీష్ రావు వెళ్లనున్నారు. ప్రజాప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేయకుండా.. కౌశిక్ రెడ్డిపై ఉల్టా కేసు పెట్టారంటూ ఆయన మండిపడ్డారు.

**నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు.. కౌశిక్ రెడ్డి**

కాగా కొద్ది నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి తన మొబైల్ ఫోన్ ట్యాప్ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశికర్‌రెడ్డి ఆరోపించారు. బుధవా రం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ప్రోద్భలంతో శివధర్‌రెడ్డి తనఫోన్ ట్యాప్ చేసి డ్రగ్స్ కేసులో ఇరికించాలని ప్రయత్నించారన్నారు. తాను కేసు పెట్టేందుకు బంజారాహిల్స్ ఏసీపీకి ఫోన్ చేస్తే రమ్మన్నారని, తనకు చెప్పిన సమయానికి ముందే ఆయన పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లిపోయారని చెప్పారు. స్టేషన్‌లో ఉన్న సీఐ తానొక ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా ప్రవర్తించారన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి సీఎం, డీజీపీ, ఇంటెలిజెన్స్ ఐజీపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కాగా, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బుధవారం బంజారాహిల్స్ పోలీసుస్టేషన్ వద్ద హంగామా సృష్టించారు. తన ఫిర్యాదు తీసుకోవాలని స్టేషన్ నుంచి బయటకు వెళుతున్న ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర వాహనాన్ని అడ్డుకోవడమే కాకుండా దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించారు.

# పీఎల్ఐ స్కీమ్ సూపర్ సక్సెస్.. ఉద్యోగాల కల్పనలో రికార్డు



భారతదేశంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం కీలక చర్యలు తీసుకుంటుంది. సాధారణంగా భారతదేశం జనాభా ప్రపంచ దేశాలతో పోలిస్తే ఎక్కువగా ఉంటుంది. ఇంత స్థాయిలో ఉన్న జనాభాకు ఉద్యోగ కల్పనకు తయారీ రంగం కీలకం అని భావించి కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ స్కీమ్ ద్వారా తయారీదారులకు ప్రత్యేక రాయితీలను కల్పిస్తున్నారు. ఈ చర్యలు భారతదేశంలో ఉద్యోగ కల్పనలో రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో పీఎల్ఐ స్కీమ్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి–అనుసంధాన ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం దేశంలో ఉద్యోగ కల్పనలో నయా రికార్డును సృష్టించింది. జూన్ 2024 వరకు మొత్తం 5.84 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించిందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వచ్చే ఐదేళ్లలో లేదా అంతటా సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్న మొత్తం 16.2 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాల్లో 36 శాతంగా ఉంది. ఇటీవల ఓ ఆర్‌టీఐ అప్లికేషన్‌కు సమాధానంగా వివిధ మంత్రిత్వ శాఖల నుంచి ఇంచుమించు 14 రంగాల్లో ఉద్యోగాల కల్పనలో పీఎల్ఐ కీలక పాత్ర పోషించింది. మొబైల్ ఫోన్లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో పీఎల్ఐ స్కీమ్ ద్వారా యువత భారీగా ఉద్యోగా పొందారు. ఈ మూడు రంగాల్లో సృష్టించిన మొత్తం ఉద్యోగాలలో 75 శాతానికి పైగా ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2026–27 నాటికి 2.5 లక్షల ఉద్యోగాలను సృష్టించేందుకు ఉద్దేశించిన ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించిన పీఎల్ఐ పథకం జూన్ 2024 నాటికి ఇప్పటికే 2.45 లక్షల ఉద్యోగాలను సృష్టించింది. పీఎల్ఐ స్కీమ్ ఏప్రిల్ 2020లో ప్రకటించారు. దేశీయ తయారీని పెంచడంతో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం లక్ష్యంగా భారత ప్రభుత్వ ఈ స్కీమ్‌ను లాంచ్ చేసింది. పీఎల్ఐ స్కీమ్ నిర్దిష్ట ఉత్పత్తి, పెట్టుబడి లక్ష్యాలను చేరుకునే అర్హత కలిగిన కంపెనీలకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తుంది.

# పరుగులు పెడుతున్న ఈపీఎఫ్ఓ కార్పస్.. ఐదేళ్లలో రెట్టింపుకంటే ఎక్కువ



ప్రతి ఒక్కరూ ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జీవితం గడపాలని కోరుకుంటారు. దీనికోసం అనేక ప్రణాళికలు వేసుకుంటారు. వీరిలో ఉద్యోగులు, వివిధ సంస్థల్లో పనిచేసే కార్మికులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) అనే పథకం అమలువుతుంది. ప్రతి నెలా వారికి వచ్చే జీతంలో కొంత భాగం దీనిలో జమచేస్తారు. యజమాని కూడా అదే మొత్తం ఆ ఉద్యోగి, కార్మికుడి ఖాతాలో వేస్తారు. ఉద్యోగ విరమణ సమయానికి అది పెద్ద మొత్తంగా మారి ఆదుకుంటుంది. ఈపీఎఫ్ పథకాన్ని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ వో) నిర్వహిస్తుంది. కాగా.. ఈపీఎఫ్ వో పెట్టుబడి కార్పస్ గత ఐదేళ్లలో రెట్టింపు అయ్యింది. దాదాపు రూ.24.75 లక్షల కోట్లకు చేరుకుంది. కేంద్ర కార్మిక మరియు ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఇటీవల లోక్ సభలో ఈపీఎఫ్ వో కార్పస్ గురించి వివరించారు. 2024 మార్చి 31 నాటికి రూ.24.75 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. ఈ మొత్తం 2019–20లో కేవలం రూ.11.1 లక్షల కోట్లుగా ఉంది. గత ఐదేళ్లలో రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి రికార్డు నెలకొల్పింది. ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం తెలియజేసిన పెట్టుబడి నమూనాకు అనుగుణంగా ఈపీఎఫ్ వో వివిధ మార్గాలలో డబ్బులను ఇన్వెస్ట్ చేస్తుంది. వాటిలో డెట్ సెక్యూరిటీలు, ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్ లు ఉంటాయి. 2015 మార్చి 31వ తేదీన సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ), ఈపీఎఫ్ సమావేశం జరిగింది. దానిలో ఆమోదించిన ప్రకారం అదే ఏడాది నుంచి సెంట్రల్ ఎక్స్చేంజ్ ఫండ్ లలో ఈపీఎఫ్ వో పెట్టుబడులు మొదలయ్యాయి. ఈపీఎఫ్ వో క్రమం తప్పకుండా ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతోంది. బీఎస్ ఈ, ఎన్ ఎస్ఈ సూచనలను తీసుకుంటుంది. ముఖ్యంగా ఎక్స్చేంజ్ ట్రేడింగ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల ద్వారా డబ్బులను ఇన్వెస్ట్ చేస్తుంది. అలాగే భారత ప్రభుత్వ వాటాల ఉప సంహరణ కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఈటీఎఫ్ లలో కూడా పెట్టుబడులు పెడుతుంది. లోక్ సభలో మంత్రి తెలిపిన వివరాల ప్రకారం 2024–25 (అక్టోబర్ 2024 వరకూ) ఈపీఎఫ్ వో రూ.34,207 కోట్లను ఈటీఎఫ్ లలో ఇన్వెస్ట్ చేసింది. కార్మిక, ఉపాధి మంత్రి మన్సుఖ్ మాండవియా అధ్యక్షతన నవంబర్ 30వ తేదీన ఈపీఎఫ్ వో సెంట్రల్ బోర్డు ట్రస్టీల సమావేశం జరిగింది.

# వచ్చే ఏడాది భారత పారాసెటమాల్



వచ్చే ఏడాది మేడ్ ఇన్ ఇండియా పారాసెటమాల్ అందుబాటులోకి రానుందని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండిస్ట్రీయల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్ కలైసెల్వి తెలిపారు. దీంతో చైనా లాంటి పారిశ్రామిక ఆవిష్కరణలపై ఆధారపడటం తగ్గనుందన్నారు. సిఎస్ఐఆర్ తొలి మహిళ డైరెక్టర్ జనరల్ అయినా కలైసెల్వి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారతదేశ పారిశ్రామిక ఆవిష్కరణలను పెంచడానికి తమ పరిశోధనా సంస్థ చేస్తున్న ప్రయత్నాల గురించి వెల్లడించారు. గడిచిన మూడు, నాలుగేళ్లలో ఎన్నో ఆవిష్కరణలు చేశామన్నారు. తాము స్వదేశీ హైడ్రోజన్ సిలిండర్ టైప్–4 పారాసెటమాల్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఇతర ఆవిష్కరణలలో హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ, హన్సా–3 టూ–సీటర్ లైట్ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్ వంటి ఏరోస్పేస్ టెక్నాలజీ, సివిడి ఫార్మింగ్ టెక్నాలజీ, రోడ్డు నిర్మాణంలో స్టీల్ స్లడ్జ్ నిర్వహణ తదితర వినూత్న కల్పనలు చేపట్టామన్నారు. "భారత్ ఇప్పటి వరకు వివిధ దేశాల నుంచి పారాసిటమాల్ పదార్థాలను దిగుమతి చేసుకుంటుంది. వచ్చే ఏడాది నాటికి భారతదేశం తన స్వంత పారాసెటమాల్‌ను తయారు చేయనుంది. సిఎస్ఐఆర్ ప్రభావవంతమైన, చౌకైనా కొత్త సాంకేతికతతో దీన్ని ఆవిష్కరిస్తుంది. భారత్‌ను ఔషధ రంగంలో మరింత స్వావలంబనగా మార్చడానికి సిఎస్ఐఆర్ టెక్నాలజీతో కర్నాటకకు చెందిన సత్య దీప్త ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ దేశీయ నూతన పారాసెటమాల్, ఇతర టాబ్లెట్లను తయారు చేయనుంది." అని కలైసెల్వి తెలిపారు. పరిశ్రమల తలుపు తట్టడం నుండి పరిశ్రమలే తమ అవసరాలు, ఆవిష్కరణల కోసం సిఎస్ఐఆర్‌ను ఆశ్రయించేలా తమ విధానం మారిందన్నారు. ప్రపంచ సరఫరా చెయిన్‌లో తమ ఉత్పత్తి వ్యవస్థలను మార్చడానికి ఎనిమిది భిన్న ప్రాంతాలను గుర్తించామన్నారు. పరిశ్రమల అవసరాలు, ఉత్పత్తి నమూనాలు, సంస్కృతి, శైలి, యంత్రాంగాన్ని అర్థం చేసుకోవడానికి సిఎస్ఐఆర్ బృందాలు క్రమం తప్పకుండా పరిశ్రమలకు అందుబాటులో ఉంటూ సాయం చేస్తున్నాయన్నారు.



# లక్ష డాలర్లు దాటిన బిట్‌కాయిన్ విలువ

బిట్‌కాయిన్ మొదటిసారి $ 100,000 పైన చేరుకుంది. అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడం వల్ల బిట్ కాయిన్ బలం పుంజుకుంది. సరిగ్గా ఇదే సమయంలో 'క్రిప్టో' ప్రపంచంలో బిట్‌కాయిన్ రూల్ చేస్తోంది..! క్రిప్టో కరెన్సీలో రారాజుగా వెలుగొందుతున్న బిట్‌కాయిన్ విలువ తాజాగా లక్ష డాలర్ల స్థాయిని దాటి రికార్డు సృష్టించింది. క్రిప్టో ప్రపంచంలో 'ది రూలర్'గా ఎవరికీ అందనంత ఎత్తుకు చేరుకుంది. క్రిప్టో కరెన్సీకి పూర్తి మద్దతు ప్రకటించిన డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకోక ముందే ఇంత భారీగా పెరుగుదల నమోదు చేసుకున్న బిట్ కాయిన్, జనవరిలో ఆయన అధ్యక్ష బాధ్యతలు చేపట్టే సమయానికి 1.25 లక్షల డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జూలై చివర్లో, డొనాల్డ్ ట్రంప్ నాష్‌విల్లే బిట్‌కాయిన్ కాన్ఫరెన్స్‌కు చేరుకున్నప్పుడు ప్రపంచానికి ఓ సందేశం ఇచ్చారు. తాను అధికారంలోకి రాగానే అమెరికాను ప్రపంచానికి క్రిప్టో రాజధానిగా మారుస్తానని చెప్పారు. ఆ ఒక్క రోజే బిట్‌కాయిన్ ధరలో 4 శాతం కంటే ఎక్కువ పెరిగి ధర 67 వేల డాలర్లకు చేరుకుంది. నవంబర్ మొదటి వారంలో అమెరికన్ ఎన్నికల ఫలితాలు వస్తున్నప్పుడు, బిట్‌కాయిన్ ధర 67 నుండి 68 వేల డాలర్ల మధ్య ఉంది. అయితే ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ ధర ఇంత త్వరగా లక్ష డాలర్లు దాటుతుందని నాష్‌విల్లే సదస్సులోగానీ, అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన తర్వాత గానీ ఊహించలేదు. నవంబర్ 5 నుండి బిట్‌కాయిన్ ధర 50 శాతానికి పైగా పెరిగింది. ఏడాది క్రితం నాటి ధరతో పోల్చితే.. బిట్‌కాయిన్‌లో ఇన్వెస్ట్ చేసినవారు 145 శాతానికి పైగా సంపాదించారు. Coinmarket డేటా ప్రకారం Bitcoin ధర 7 శాతం కంటే ఎక్కువ పెరుగుదలతో $102,656.65 వద్ద ప్రస్తుతం ట్రేడవుతోంది.

# ప్రతి సంవత్సరం టికెట్లపై రైల్వే ఎంత సబ్సిడీ ఇస్తుందో తెలుసా



ప్రతి టికెట్‌పై 46 శాతం రాయితీతో భారతీయ రైల్వే అన్ని వర్గాల ప్రయాణికులకు ప్రతి సంవత్సరం రూ. 56,993 కోట్ల మొత్తం సబ్సిడీని ఇస్తుందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. భారతీయ రైల్వేలు ప్రతి సంవత్సరం అన్ని వర్గాల ప్రయాణికులకు మొత్తం రూ.56,993 కోట్ల సబ్సిడీని అందజేస్తున్నాయి. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతి టికెట్‌పై రైల్వే దాదాపు 46 శాతం రాయితీ ఇస్తోందని తెలిపారు. రైల్వే టిక్కెట్లలో తగ్గింపుకు సంబంధించిన ప్రశ్నకు సమాధానంగా, అశ్విని వైష్ణవ్ సభలో మాట్లాడుతూ, భారతీయ రైల్వే ప్రతి సంవత్సరం అన్ని వర్గాల ప్రయాణీకులకు మొత్తం రూ. 56,993 కోట్ల సబ్సిడీని ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో ప్రతి టికెట్‌పై 46 శాతం తగ్గింపు ఇస్తారు. లోక్‌సభలో ఆయన సమాధానం ఇస్తూ.. టికెట్ ధర రూ. 100 అయితే రైల్వే శాఖ మాత్రం రూ.54 మాత్రమే వసూలు చేస్తుందన్నారు. అంటే ప్రయాణీకుడికి 46 శాతం తగ్గింపు లభిస్తుందని స్పష్టం చేశారు. వేగవంతమైన రైలు సేవలకు సంబంధించిన మరో ప్రశ్నకు అశ్వని వైష్ణవ్ స్పందిస్తూ, రైల్వే ఇప్పటికే భుజ్ – అహ్మదాబాద్ మధ్య నమో భారత్ ర్యాపిడ్ రైల్ సేవను ప్రారంభించిందని,దాని మెరుగైన సేవ కారణంగా ప్రయాణీకులలో సంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. నమో భారత్ ర్యాపిడ్ రైలు భుజ్ – అహ్మదాబాద్ మధ్య 359 కిలోమీటర్ల దూరాన్ని 5 గంటల 45 నిమిషాల్లో అధిగమించడం ద్వారా ఇంటర్‌సిటీ కనెక్టివిటీని మెరుగుపరిచిందని రైల్వే మంత్రి తెలిపారు.నేటి అధునిక యుగంలో భారతీయ రైల్వే ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రజలకు మంచి సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# ఫీచర్స్‌తో టాప్ రేపుతున్న స్మార్ట్ ఫోన్లు..



ప్రస్తుతం ప్రపంచంలో స్మార్ట్ ఫోన్స్ హవా నడుస్తుంది. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండాల్సి పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతి నెలా సరికొత్త కొత్త ఫోన్‌లు లాంచ్ అవుతున్నాయి. అయితే భారతదేశంలో మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బడ్జెట్ ఫ్రెండ్లీ స్మార్ట్ ఫోన్లను ఇష్టపడుతున్నారు. కాబట్టి ప్రస్తుం రూ. 20 వేల ధర పరిధిలో అందుబాటులో ఉన్న బడ్జెట్ ఫ్రెండ్లీ ఫోన్లపై ఓ లుక్కేద్దాం. ఐక్యూ జెడ్–9 స్మార్ట్ ఫోన్ మీడియాటెక్ డైమెన్సిటీ 7200 ఆక్టా–కోర్ ప్రాసెసర్‌తో ఆధారంగా పని చేస్తుంది. ఈ ఫోన్ 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 6.67 అంగుళాల ఎమోఎల్ఈడీ డిస్‌ప్లేతో ఆకర్షిస్తుంది. బ్యాక్ కెమెరా విషయానికి వస్తే 2 ఎంపీ సెకండరీ సెన్సార్‌తో జత చేసిన 50ఎంపీ ప్రైమరీ సెన్సార్ ఉంటుంది. అలాగే 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. 8 జీబీ ం 128 జీబీ వేరయంట్‌లో వచ్చే ఈ ఫోన్ 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే 44 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్‌కు మద్దతునిస్తుంది. ఈ ఫోన్ ధర రూ.19,998గా ఉంది. ఐక్యూ జెడ్–9 స్మార్ట్ ఫోన్ మీడియాటెక్ డైమెన్సిటీ 7200 ఆక్టా–కోర్ ప్రాసెసర్‌తో ఆధారంగా పని చేస్తుంది. ఈ ఫోన్ 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 6.67 అంగుళాల

ఎమోఎల్ఈడీ డిస్‌ప్లేతో ఆకర్షిస్తుంది. బ్యాక్ కెమెరా విషయానికి వస్తే 2 ఎంపీ సెకండరీ సెన్సార్‌తో జత చేసిన 50ఎంపీ ప్రైమరీ సెన్సార్ ఉంటుంది. అలాగే 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. 8 జీబీ ం 128 జీబీ వేరయంట్‌లో వచ్చే ఈ ఫోన్ 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే 44 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్‌కు మద్దతునిస్తుంది. ఈ ఫోన్ ధర రూ.19,998గా ఉంది. మోటో జీ 85 ఫోన్ స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జెన్–3 ఆక్టా–కోర్ ప్రాసెసర్‌తో పని చేస్తుంది. 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 6.67 అంగుళాల పీఓఎల్ఈడీ డిస్ప్లేతో ఆకట్టుకుంటుంది బ్యాక్ కెమెరా సిస్టమ్‌లో 50 ఎంపీ ప్రైమరీ సెన్సార్, 8 ఎంపీ అల్ట్రా–వైడ్ లెన్స్ ఉన్నాయి. అయితే ఫ్రంట్ కెమెరా హై–రిజల్యూషన్ సెల్ఫీల కోసం 32 ఎంపీ సెన్సార్ ఆధారంగా పని చేస్తుంది. 33 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు మద్దతు ఇచ్చే 5000ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫోన్ ప్రత్యేకత. ఈ ఫోన్ ధర రూ.19,198గా ఉంది.

# దిగొచ్చిన యోగి సర్కార్ నోయిడాలో రైతుల భారీ ఆందోళన

న్యూఢిల్లీ : యూపీలోని రైతు వ్యతిరేక యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధుల మీద పోలీసుల దౌర్జన్యంపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. యోగి సర్కార్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా బుధవారం గ్రేటర్ నోయిడాలోని యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై జీరో పాయింట్ వద్ద భారీ మహాపంచాయత్‌ను నిర్వహించారు. డిమాండ్లన్నీ సాధించే వరకు నోయిడా-ఢిల్లీ హైవేలోని దళిత్ ప్రేరణ స్థల్ వద్ద పగలు,

రాత్రి ఆందోళన కొనసాగించాలని మహాపంచాయత్ నిర్ణయించింది. శాంతియుతంగా నిరసన తెలిపే వారి ప్రాథమిక హక్కును ఉల్లంఘించి మంగళవారం జైలులో పెట్టిన 160 మంది రైతులందరినీ విడుదల చేయాలని యోగి సర్కారును డిమాండ్ చేసింది. 16 గంటల తర్వాత రైతు నేతలు, రైతులు, మహిళలు విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన రైతులకు మహాపంచాయత్ ఘన స్వాగతం పలికింది. రైతు నేతలను భుజాలపైకి ఎక్కించుకుని రైతులు వేదిక వద్దకు తీసుకెళ్లారు. విడుదలైన రైతు నాయకులు డాక్టర్ రూపేష్ వర్మ, సుఖ్‌బీర్ ఖలీఫా, సునీల్ ఫౌజీ తదితరులు మహాపంచాయత్‌లో ప్రసంగించారు. ఏ అధికారినీ నమ్మొద్దనీ, అధికారులు రైతులను మోసం చేశారని విమర్శించారు. ఏడు రోజుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చి, రైతులను అరెస్టు చేసి జైలుకు పంపారని విమర్శించారు. రైతులకు అనుకూలంగా 10 శాతం ప్లాట్లు, భూ సేకరణ వల్ల కలిగే అన్ని ప్రయోజనాలు ఇవ్వాలని, అంతకంటే తక్కువ రైతులకు ఆమోదయోగ్యం కాదంటూ హైపవర్ కమిటీ చేసిన సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే మళ్లీ ఢిల్లీకి వెళ్తామని స్పష్టంచేశారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ.. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులను అరెస్టు చేయడం ప్రభుత్వ అణచివేత విధానమనీ, రైతులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం రైతుల మనోధైర్యాన్ని విచ్చిన్నం చేయలేదని స్పష్టం చేశారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 18 వ వార్డులో పాతూరి సతీష్ నాగరాణి దంపతుల కుమారుడు పాతూరి కళ్యాణ్ స్వామి నాలుగవ మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు అయ్యప్ప మహా పడిపూజ లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎన్ సి రాజమౌళి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని అయ్యప్ప మాల ధారణ వల్ల సర్వపాపాలు తొలగిపోయి కోరిన కోరికలు నెరవేరుతాయి అని అన్నారు, అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించిన పాతూరి కళ్యాణ్ స్వామికి వారి కుటుంబ సభ్యులకు అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు నిండుగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఉప్పల మెట్టయ్య గురుస్వామి, ఎర్రం శ్రీనివాస్ గురు స్వామి, బిఆర్ఎస్ యువ నాయకుడు ఎన్ సి సంతోష్, వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అమెరికాకు హైటెక్ మెటీరియల్స్ ఎగుమతి నిషేధం

బీజింగ్: అమెరికాకు గాలియం, జెర్మేనియం, యాంటీమోనీ మరియు కీలకమైన హైటెక్ మెటీరియల్స్ ఎగుమతులను చైనా నిషేధించింది. చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం నిషేధాన్ని ప్రకటించింది. చైనా కంపెనీల కంప్యూటర్ చిప్‌ల తయారీ పరికరాలు, సాఫ్ట్‌వేర్, బ్యాండ్‌విడ్త్ మెమరీ చిప్‌లపై ఎగుమతి పరిమితులను విధించినట్లు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో చైనా కొత్త నిర్ణయం తీసుకుంది. అమెరికాకు గాలియం వంటి వ్యూహాత్మక పదార్థాలను పంపేందుకు ఎగుమతిదారులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చైనా గతంలో కోరింది. 'ఎంటిటీ జాబితా' అని పిలవబడే యుఎస్ లో కొత్తగా జాబితా చేయబడిన 140 కంపెనీలలో దాదాపు అన్నీ చైనాకు చెందినవి. జాబితాలో ఉన్న ఇతర కంపెనీలు జపాన్, దక్షిణ కొరియా మరియు సింగపూర్‌లో చైనా యాజమాన్యంలో ఉన్నాయి. పెట్టుబడిదారీ దేశాల స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా చైనా వాణిజ్య అవసరాలు, హక్కులను కాలరాసే విధానాల అమలును గట్టిగా సమర్థిస్తామని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.

# పాలస్తీనా నుంచి ఇజ్రాయిల్ వైదొలగాల్సిందే

న్యూయార్క్ : తూర్పు జెరూసలేం సహా 1967 నుండి తన ఆక్రమణలో ఉన్న పాలస్తీనా భూభాగం నుండి ఇజ్రాయిల్ వైదొలగాల్సిందేనన్న డిమాండ్‌ను భారత్ సమర్థించింది. దీనికి సంబంధించి ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి మన దేశం అనుకూలంగా ఓటేసింది. ఈ ఓటింగ్ మంగళవారం జరిగింది. ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య జరుగుతున్న ఘర్షణలపై అంతర్జాతీయంగా జరుగుతున్న చర్చలో భాగంగానే ఐరాస జనరల్ అసెంబ్లీలో ఓటింగ్ నిర్వహించారు. 'పాలస్తీనా అంశానికి శాంతియుత పరిష్కారం' అనే శీర్షికతో రూపొందించిన ఈ తీర్మానాన్ని సెనెగల్ ప్రతిపాదించగా అత్యధికంగా సభ్య దేశాలు మద్దతు తెలిపాయి. పాలస్తీనా నుండి ఇజ్రాయిల్ వైదొలగాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భారత్ సహా 157 దేశాలు ఆమోదించాయి. తీర్మానాన్ని కేవలం ఎనిమిది దేశాలు.. ఇజ్రాయిల్, అమెరికా, మైక్రోనేషియా, న్యూరూ, పాలవ్, పపువా న్యూ గునియా, అర్జెంటీనా, హంగరీ మాత్రమే వ్యతిరేకించాయి.

కామెరూన్, చెచియా, ఈక్వెడార్, జార్జియా, పరాగ్వే, ఉక్రెయిన్, ఉరుగ్వే సహా పలు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఈ తీర్మానాన్ని భారత్ బలపరచడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పాలస్తీనా విషయంలో దీర్ఘకాలంగా దేశం అనుసరిస్తూ వస్తున్న వైఖరిని ఇది ప్రతిబింబిస్తోంది. ఒకప్పటి మాండెటరీ పాలస్తీనా (1920-1948 మధ్యకాలంలో మనుగడలో ఉన్న భౌగోళిక రాజకీయ ప్రదేశం) భూభాగంలో రెండు దేశాలను ఏర్పాటు చేసి, తద్వారా ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణను నివారించడానికి ఉద్దేశించిన పరిష్కారానికి భారత్ ఎప్పటి నుండో మద్దతు ఇస్తోంది. మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నామని ఈ ఓటింగ్ ద్వారా భారత్ పునరుద్ఘాటించింది. ఇజ్రాయిల్ దురాక్రమణను అంతం చేసి, స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయాలన్న ఐరాస పిలుపుతో ఏకీభవించింది.

# బందీలను తక్షణమే విడుదల చేయాలి



న్యూయార్క్: గాజాలో హమాస్ చెరలో వున్న ఇజ్రాయిల్ బందీలను తక్షణమే విడుదల చేయాలని అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్ డిమాండ్ చేశారు. తాను ప్రమాణ స్వీకారం చేసేలోగా వారిని విడుదల చేయకపోతే నరకం చూపిస్తానని హెచ్చరించారు. తాను అధ్యక్షుడిగా ప్రమాణం చేసే జనవరి 20వ తేదీ లోగా బందీలను విడుదల చేయని పక్షంలో ఇక అక్కడ (మధ్య ప్రాచ్యంలో) నరకమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఇజ్రాయిలీలను బందీలుగా చేయడానికి ఎవరైతే బాధ్యులో వారు కచ్చితంగా మిగిలిన వారికన్నా దెబ్బ తింటారన్నారు. ఈ హెచ్చరికలు చూస్తుంటే గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో ఇకపై అమెరికా మిలటరీ ప్రత్యక్ష ప్రమేయం వుంటుందా అన్న అనుమానం తలెత్తుతోంది. కానీ దీనిపై వెంటనే స్పష్టత రాలేదు. ఆయన అధికారం చేపట్టే సమయానికి గాజాలోకాల్పుల విరమణ జరగగలదని మిత్రపక్షాలు ఆశిస్తున్నాయి. దీనిపై వ్యాఖ్యానించడానికి ఇజ్రాయిల్ ప్రధాని కార్యాలయం తిరస్కరించింది. కానీ ట్రంప్ వ్యాఖ్యలను ఇజ్రాయేె అధ్యక్షుడు ఇజాక్ హెర్జొగ్ స్వాగతించారు. బందీలందరూ తిరిగి వారి ఇళ్లకు చేరే క్షణం కోసం తామంతా ఆతృతగా ఎదురుచూస్తున్నామన్నారు. అమెరికా, ఇజ్రాయిల్‌ల్లో ద్వంద్వ పౌరసత్వం కలిగిన ఒమర్ న్యూట్రా మృతి చెందాడని ఇజ్రాయిల్ ప్రభుత్వం ధృవీకరించిన గంటల వ్యవధిలోనే ట్రంప్ హెచ్చరిక వెలువడింది. ఒమర్ న్యూట్రా మృతదేహం ఇంకా హమాస్ అదుపులోనే వుందని భావిస్తున్నారు. తమ విడుదల కోసం ట్రంప్ కృషి చేయాలని అంతకు కొన్ని రోజుల ముందే హమాస్ చెరలో వున్న మరో బందీ ఎడాన్ అలెగ్జాండర్ విజ్ఞప్తి చేశారు.

# రైల్వేను ప్రయివేటీకరించొద్దు



న్యూఢిల్లీ: లోక్‌సభలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రవేశపెట్టిన రైల్వే సవరణ బిల్లుపై చర్చ పూర్తయ్యింది. బిల్లుపై జరిగిన చర్చలో రైల్వేలను ప్రైవేటీకరణకు దూరంగా ఉంచాలని ప్రతిపక్ష ఎంపిలు కోరారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి నీరజ్ మౌర్య రైల్వేలను ప్రైవేటీకరణ చేతుల నుండి దూరంగా ఉంచాలన్న అభ్యర్థనను పునరుద్ఘాటించారు. దేశానికి రైల్వే జీవనాధారమని, రైల్వే బోర్డు నిర్ణయాధికారంలో స్వతంత్రంగా ఉండేందుకు అనుమతించాలని అన్నారు.

చలికాలంలో పొగమంచు కారణంగా ప్రయాణంలో జాప్యానికి సంబంధించిన సమస్యలను లేవనెత్తారు. కోవిడ్ సమయంలో అనేక రైళ్లు రద్దు చేశారని, వాటిలో చాలా వరకు పునఃప్రారంభించలేదని తెలిపారు. రైల్వే బోర్డు నిర్ణయాలపై ప్రభుత్వం జోక్యం కొనసాగిస్తుందా? అని శివసేన (యుబిటి) ఎంపి అరవింద్ సావంత్ ప్రశ్నించారు. రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణలో నిర్వాసితులకు పునరావాసం ఇంకా అందించలేదని అన్నారు. ప్రభుత్వం ఖాళీల భర్తీకి ప్రాధాన్యతనివ్వాలని సిపిఎం ఎంపి అమ్రారామ్ కోరారు. ప్రస్తుతం జరుగుతున్నట్లుగానే రైల్వే ఉద్యోగులపై పనిభారం పడకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

లోకో పైలెట్‌లు, టికెట్ కలెక్టర్ (టిసి), టికెట్ ఎగ్జామినర్లు (టిఇ) సహా రైల్వేలోని ఉద్యోగులకు విశ్రాంతి, పనికోసం సరైన సమయం కల్పించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ప్రాజెక్టులు, మరమ్మతు పనులు పూర్తి కావడానికి నిర్ణీత తేదీ లేకుండా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. రైల్వే బోర్డులో షెడ్యూల్డ్ కులాలు, తెగల సభ్యులను చేర్చాలని సేలంపూర్ ఎంపి రామశంకర్ రాజ్‌భర్ కోరారు.

# అమరవాది లక్ష్మీనారాయణ ను కలిసిన ఆర్యవైశ్యులు



సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం గురువారం హైదరాబాద్ లో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ను మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించారు అనంతరం సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సముద్రల హరినాథ్ ను రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావాది లక్ష్మీనారాయణ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, జిల్లా నాయకులు తడక లింగం,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుద్ధ సత్యం,జగదేవపూర్ మండల అధ్యక్షులు చంద్ర శేఖర్, జగదేవపూర్ పట్టణ అధ్యక్షులు కుకుటపు కొండలు,పెద్ది శ్రీనివాస్, జగదేవపూర్ ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరా మహిళా శక్తి బజార్ ను పరిశీలించిన సీతక్క



హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :మాదాపూర్ లోని శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ను మంత్రి సీతక్క సందర్శించారు. గురువారం గవర్నర్ చేతులమీదుగా ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంబోత్సవం జరగనున్న నేపథ్యంలో నిర్మాణం పనులు, ప్రారంబోత్సవ ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి సీతక్క పరిశీలించారు. త్వరతగతిన పనులు అన్ని పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశించారు.



# అస్సాంలో గొడ్డు మాంసం నిషేధం

అస్సాం : గొడ్డు మాంసం తినడాన్ని నిషేధిస్తున్నట్లు అస్సాంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. ముస్లిం ఓటర్లను ప్రభావితం చేసేందుకు రాజకీయ పార్టీలు గొడ్డు మాంసం పంపిణీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా, ధుబ్రీ ఎంపీ రకీబుల్ హుస్సేన్‌ల ప్రకటనలను విశ్లేషించిన తర్వాత తమ మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ తెలిపారు. ఈ ప్రకటనతో హోటళ్లు, రెస్టారెంట్లు, పండుగలు మరియు కమ్యూనిటీ కార్యక్రమాలలో గొడ్డు మాంసం తినడం నిషేధించబడింది. మతపరమైన, సామాజిక, ఇతర ప్రజా కార్యక్రమాలలో గొడ్డు మాంసం వడ్డించబడదని తెలిపారు. అస్సాం పశుసంరక్షణ చట్టం 2021ని బలోపేతం చేయడానికి ఈ నిబంధన జోడించబడుతుందని ఆయన చెప్పారు. గొడ్డు మాంసం వినియోగాన్ని నిషేధించే రాష్ట్ర క్యాబినెట్ చర్యను ఎమ్మెల్యే, మైనారిటీ ఆధారిత ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి హాఫీజ్ రఫీకుల్ ఇస్లాం వ్యతిరేకించారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రజలు ఏమి తినాలో లేదా ఏమి ధరించాలో కేబినెట్ నిర్ణయించకూడదని అన్నారు. గొడ్డు మాంసం విషయంలో బీజేపీకి పొంతన లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. గోవా లేదా ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి గోమాంసాన్ని నిషేధించలేదని, అస్సాంలో ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. తాము ఈ నిర్ణయాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా మన్మోహన్ ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ఇతర సిట్టింగ్ జడ్జీల సమక్షంలో సుప్రీంకోర్టులో ఈ వేడుక జరిగింది. జస్టిస్ మన్మోహన్ ప్రమాణస్వీకారంతో .. సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 33కి చేరింది. 1962 , డిసెంబర్ 17 జన్మించిన జస్టిస్ మన్మోహన్ 1987లో ఢిల్లీ క్యాంపస్ లా సెంటర్ నుండి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. అదే ఏడాది సుప్రీంకోర్టు, ఢిల్లీ హై కోర్టులో ప్రాక్టీస్ చేస్తూ న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003లో సీనియర్ న్యాయవాదిగా నియమితులైన ఆయన 2008లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2009లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2023లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, 2024లో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ మన్మోహన్‌ను అత్యున్నత న్యాయస్థానానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 3న కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.

# షిండేశకం ముగిసింది..



ముంబయి : మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండేపై శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ గురువారం విరుచుకుపడ్డారు. షిండే శకం ముగిసిందని, ఆయన మళ్లీ ఇక ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. మహాయుతి కూటమి బుధవారం దేవేంద్ర ఫడ్నవీస్‌ను తదుపరి ముఖ్యమంత్రిగా, షిండేను ఉప ముఖ్యమంత్రిగా ప్రకటన విడుదల చేసిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. షిండేను బిజెపి పావులా వాడుకుందని, ఇప్పుడు పక్కకు విసిరేసిందని సంజయ్ రౌత్ ఎద్దేవా చేశారు. షిండే శకం ముగిసిపోయి రెండేళ్లు అయ్యిందని, ఇప్పుడిక ఆయన అవసరం బిజెపికి లేదని అన్నారు. షిండే మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేరని చెప్పారు. అవసరసమైతే షిండే పార్టీని కూడా బిజెపి విచ్ఛిన్నం చేయగలదని.. ఇది ప్రధాని మోడీ రాజకీయ పంథా అని అన్నారు. స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ.. 15 రోజులైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. అంటే వారి కూటమిలో ఏదో లోపం ఉందని అర్థమౌతుందని అన్నారు. ఇవాళ కాకపోతే తర్వాతైనా బయటికి వస్తుందని చెప్పుకొచ్చారు.

# ప్యాకేజ్డ్ నీరు ప్రమాదకరమే !

న్యూఢిల్లీ : సీసాలలో ప్యాక్ చేసి విక్రయించే తాగునీరు, మినరల్ వాటర్ సురక్షితమైనదని భావిస్తున్నారా? అయితే మీ అభిప్రాయం సరైంది కాదని దేశీయ ఆహార నియంత్రణ సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) తేల్చేసింది. ప్యాకేజ్డ్ తాగునీరు, మినరల్ వాటర్%ొ%ఈ రెండింటితోనూ ముప్పుందని స్పష్టం చేసింది. ఈ నీటిని నిరంతరం పరీక్షిస్తూ, తనిఖీలు నిర్వహిస్తూ కఠినమైన రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపింది. ప్యాకేజ్డ్ తాగునీటికి, మినరల్ వాటర్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) సర్టిఫికేషన్ అవసరం లేకుండా అక్టోబరులో కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ప్యాకేజ్డ్ తాగునీటిని, మినరల్ వాటర్‌ను ఉత్పత్తి చేసే వారు, ప్రాసెస్ చేసే వారు లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందడానికి ముందు విధిగా తనిఖీలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం గత నెల 29వ తేదీ నుండే అమలులోకి వచ్చింది.

# బీరకాయ బెనిఫిట్స్ తెలిస్తే వదిలిపెట్టరు

బిరకాయలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే బీరకాయలో జింక్, ఐరన్, పొటాషియం విటమిన్లతో పాటు ఎన్నో ఖనిజాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను మరింత మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా బీరకాయతో కలిగే ప్రయోజనాల్లో.. బీరకాయ బెనిఫిట్స్ తెలిస్తే వదిలిపెట్టరు.. ఇమ్యూనిటీ పెరగడంతో పాటు, గుండెకు కూడా మంచిదే..! ఎన్నో అనారోగ్య సమస్యలను దూరం చేసే పోషకాలు కూరగాయల్లో ఉంటాయి. అలాంటి కూరగాయల్లో బీరకాయ కూడా ఒకటి. బీరకాయలో తక్కువ కేలరీలతో పాటు ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లతో పాటు విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. బీరకాయ జీర్ణక్రియను మరింత మెరుగ్గా పనిచేసేలా చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో బీరకాయ ఎంతో మేలు చేస్తుంది.. బీరకాయ తీసుకోవడం వల్ల కలిగే ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.. బీరకాయలో నీరు, ఫైబర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. బీరకాయలో విటమిన్ ఏ, సీ, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి6, పొటాషియం, సోడియం లభిస్తాయి. ఇందులో మంచి మొత్తంలో పొటాషియం ఉంటుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మధుమేహం బాధితుల్లో రక్తంలోని షుగర్ స్థాయిలను నియంత్రించడంలో బీరకాయ ఎంతో మేలు చేస్తుంది. బీరకాయలో చరంటిన్ అనే పదార్ధం ఉంటుంది. ఇది రక్తంలోని షుగర్ స్థాయిలు అదుపులో ఉండేలా చేస్తుంది. బీరకాయలో ఉండే పీచు పదార్థం రక్తంలోని షుగర్ లెవల్స్ ఆకస్మికంగా పెరగడాన్ని నివారిస్తుంది. బీరకాయలో ఉండే మంచి మొత్తంలో పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. బరువును తగ్గించడంలో బీరకాయ సహాయపడుతుంది. ఆకలిని తగ్గించడమే కాకుండా అతిగా తినడాన్ని నివారిస్తుంది.. శరీరంలోని అదనపు నీటిని తొలగిస్తుంది. దీంతో శరీర బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది. అధిక బరువుతో ఇబ్బంది పడేవారు తరచూగా బీరకాయ తీసుకోవడం వల్ల లాభం ఉంటుంది. బీరకాయలో కొవ్వులు తక్కువగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పటిష్టం చేయడానికి బీరకాయ చాలా ఉపయోగపడుతుంది. బిరకాయలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే బీరకాయలో జింక్, ఐరన్, పొటాషియం విటమిన్లతో పాటు ఎన్నో ఖనిజాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను మరింత మెరుగుపరుస్తాయి. బీరకాయ చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. వృద్ధాప్య సంకేతాలను దూరం చేస్తుంది. బీరకాయలో ఉండే విటమిన్ సి, కెరిటన్ వంటి యాంటీఆక్సిడెంట్లు



ఫ్రీ రాడికల్స్ నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. బీరకాయలో ఉండే సిలికా అనే ఖనిజం చర్మం, జుట్టు, గోళ్లు ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తుంది. బీరకాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మ సమస్యలు తీరిపోయి చర్మ సౌదర్యం పెరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.



# లవంగంతో ప్రయోజనాలు

వంగాలు మన శరీరానికి అనేక పోషకాలను అందిస్తాయి. లవంగాలలో ండే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరని చెబుతున్నారు రోగ్య నిపుణులు. ఆయుర్వేదంలో లవంగాలను పూర్వం నుంచి ఉ యోగిస్తున్నారు. లవంగాలు సీజనల్ వ్యాధులు,ఇన్ఫెక్షన్లను దూరంగా ంచేలా చేస్తాయి. కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం యడం నుండి ఎముకల ఆరోగ్యం వరకు లవంగాలతో కలిగే యోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. లవంగాలలో ఐరన్, ల్షియం, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, కార్బోహైడ్రేట్లు, హైడ్రాలిక్ ూసిడ్, విటమిన్ ఏ, మాంగనీస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉ టాయి. లవంగాల వినియోగం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కీళ్ల ొప్పులు, వికారం, కడుపునొప్పి, గ్యాస్ట్రిక్, దంత ఆరోగ్య సమస్యలను గ్గిస్తుంది. రోజుకు ఒక లవంగాన్ని నమలడం వల్ల అనేక ఆరోగ్య యోజనాలు పొందుతారు. రోజూ ఉదయాన్నే రెండు లవంగాలను మలడం వల్ల జీర్ణక్రియ జరుగుతుంది. తీవ్రమైన దగ్గుతో ఇబ్బంది పడుతున్న వారికి లవంగం మంచి ఉపశమానాన్ని ఇస్తుంది. దంత సమస్యలను నివారించే శక్తి కూడా లవంగాలకు ఉంది. లవంగాలలో ఉండే యాంటీ జింజివిటిస్, యాంటీప్లేక్ లక్షణాలు దంతాలను ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడతాయి.. లవంగాలు నోటిలోని సూక్ష్మజీవులను నిరోధించడంలో సహాయపడటమే కాకుండా, చిగుళ్లలో ఇన్ఫెక్షన్, మంట, నొప్పి నుంచి ఉపశమనం అందిస్తాయి. అంతేకాదు..లవంగాలను చక్కెర స్థాయిని నియంత్రించే శక్తి కూడా ఉంది. దీని కోసం లవంగం టీ తయారు చేసుకుని తీసుకోవాలి. ఇందుకోసం ఒక గ్లాసు నీటిలో 8–10 లవంగాలను మరిగించాలి. ఆ తరువాత, నీటిని ఫిల్టర్ చేసి కొద్దిగా చల్లారిన తర్వాత తాగాలి. దీంతో అద్భుత ప్రయోజనం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చర్మ సమస్యలకు కూడా లవంగంతో చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. ఇందుకోసం లవంగాన్ని మెత్తగా నూరి, మొటిమల మీద రాస్తే, మొటిమ పక్కకు విస్తరించకుండా త్వరగా రాలిపోతుంది. అలాగే, వాంతి అవుతుందనిపించినప్పుడు లవంగాన్ని వాసన చూడాలి. అలాగే లవంగం రసాన్ని చప్పరించినా ఫలితం ఉంటుంది.

# డయాబెటిక్‌లో సబ్జా గింజల మ్యాజిక్


శరీరంలోని బ్లడ్ షుగర్ లెవెల్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడుతుంది. తక్కువ నీరు త్రాగడం, సరైన జీవనశైలి కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వస్తుంది. సబ్జా గింజలు వీలైనంత ఎక్కువ నీరు త్రాగడమే కాకుండా..చెడు ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్థమైన జీవనశైలి కారణంగా అనేక రోగాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ప్రజలు మధుమేహం, మలబద్ధకం వంటి సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. చిన్నవయసులోనే చాలా మంది మధుమేహం బారినపడుతున్నారు. నీరు, సరైన ఫైబర్ ఆహారాలు లేకపోవడం వల్ల మలబద్ధకం సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ఇటువంటి సమస్యలను తగ్గించడానికి లేదా ఉపశమనం పొందడానికి ఇంటి నివారణలు చక్కటి ఫలితాలను ఇస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరంగా భావించే సబ్జా గింజలతో మధుమేహం, మలబద్ధకాన్ని ఎలా నివారించవచ్చో ఇక్కడ తెలుసుకుందాం..మధుమేహం నయం కాదు. కాని కొన్ని ఇంటి చిట్కాలు, ఆయుర్వేద ఔషధాలు తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందులో ముఖ్యంగా సబ్జా



విత్తనాలు మధుమేహులకు మంచి హెూం రెమిడీగా చెబుతున్నారు. సబ్జా విత్తనాల్లో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. మీరు తరచుగా మలబద్ధకంతో బాధపడుతుంటే, ప్రతిరోజూ సబ్జా గింజలను తినండి. ఇందులో పీచు పుష్కలంగా ఉండి మలబద్ధకాన్ని దూరం చేస్తుందని చెబుతున్నారు. మధుమేహంతో బాధపడేవారు సబ్జా గింజలను తీసుకోవచ్చు. వీటిని నీళ్లలో నానబెట్టుకుని తాగటం వల్ల మంచి ఫలితాలను పొందుతారు.

ఖాళీ కడుపుతో సబ్జా నీటిని తాగటం వల్ల ఫలితం ఉంటుంది. శరీరంలోని బ్లడ్ షుగర్ లెవెల్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడుతుంది. తక్కువ నీరు త్రాగడం, సరైన జీవనశైలి కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వస్తుంది. సబ్జా గింజలు వీలైనంత ఎక్కువ నీరు త్రాగడమే కాకుండా మూత్రనాళ ఇన్ఫెక్షన్లను కూడా నయం చేస్తాయి. అంతేకాదు.. తలనొప్పి, గొంతులో మంట, ఆస్తమా, తీవ్రమైన జ్వరం వంటి అనేక సమస్యల నుంచి సబ్జా గింజలు ఉపశమనం కలిగి నీళ్లలో సబ్జా గింజలను నానబెట్టుకొని, వాటిని తినేయాలని చెబుతున్నారు.

# సైలెంట్‌గా ఉంటే కలిగే లాభాలు



ద్ద పెద్ద శబ్దాలు, గట్టిగా అరుచుకోవడం వల్ల న శరీరంతో పాటు మనస్సు, మెదడును కూడా భావితం చేస్తుందని ఆరోగ్య నిపుణులు బుతున్నారు. దీంతో మనలో ఒత్తిడి రుగుతుందని చెబుతున్నారు. మానసిక రోగ్యానికి మౌనం ఎంతో బాగా ఉ యోగపడుతుందని ఆరోగ్య నిపుణులు ాచిస్తున్నారు. మౌనంగా ఉండడం వల్ల మనలో త్తిడిని తగ్గిస్తుంది. మిమ్మల్ని మీరు ప్రశాంతంగా ండేలా చేస్తుంది. దీంతో హాయిగా నిద్ర డుతుందని, రక్తపోటు సమతుల్యం అవుతుందని బుతున్నారు. మౌనంగా ఉండడం వల్ల మెదడు రోగ్యం చాలా బాగుంటుంది. మెదడుకు సంబంధించిన సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. మీ మౌనంతో జ్ఞాపకశక్తిని కూడా పెంచుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. రోజులో ఓ గంటపాటు మౌనంగా ఉండడం వల్ల మీలో క్రియేటివిటీని పెంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు. సైలెంట్‌గా ఉండటం వల్ల ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా ఉంటారు. దీంతో నిద్రలేమి సమస్య నుంచి బయటపడవచ్చు అంటున్నారు.

ఫలితంగా సుఖంగా, ప్రశాంతంగా నిద్రపోవడానికి వీలు అవుతుంది. అంతేకాదు, మౌనంగా ఉండడం వలన కమ్యూనికేషన్ కూడా పెరుగుతుంది. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఇంప్రూవ్ చేసుకోవచ్చు. ప్రశాంతతను పెంపొందించడానికి మౌనం బాగా పనిచేస్తుంది. రోజూ కాసేపు సైలెంట్‌గా ఉంటే ఎంతో ప్రశాంతంగా ఉండొచ్చు. ఒత్తిడి కూడా ఉండదు. దీంతో గుండె సమస్యలు కూడా రాకుండా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, మౌనం వల్ల శరీరంలో రక్త ప్రసరణ కూడా బాగా జరుగుతుంది. మీలో కోపం అదుపులో ఉండాలంటే మౌనం చక్కగా పనిచేస్తుంది. రోజూ కాసేపు సైలెంట్‌గా ఉండడం వల్ల కోపం బాగా తగ్గుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. మౌనంగా ఉంటే ప్రశాంతత వస్తుంది. దానితో మంచి నిర్ణయాలు తీసుకుంటారు. మిమ్మల్ని మీరు ఇంప్రూవ్ చేసుకోవచ్చు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల ముందుకు వెళ్లలేము. కానీ మౌనంగా ఉంటే అనుకున్నవి సాధించగలం అంటున్నారు

నిపుణులు. శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడు మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా సంతోషకరమైన జీవనాన్ని సాగించగలుగుతాం. కాబట్టి మౌనానికి ఉన్న శక్తిని అర్ధం చేసుకోవాంటున్నారు. కనీసం రోజుకు గంట సేపైనా నిశ్శబ్దంగా ఉండి మనం మన శరీరాన్ని, మనసును కంట్రోల్ లో ఉంచుకోవాలని మానసిక ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.




# యాంటీబయాటిక్స్ తీసుకుంటున్నారా?

నిపుణుల సలహా మేరకు మాత్రమే యాంటీబయాటిక్స్ చాలా జాగ్రత్తగా వాడాలని, యాంటీబయాటిక్స్ ఎక్కువ కాలం తీసుకోకూడదని నిపుణులు భావిస్తున్నారు. మీరు సాధారణ.. దీర్ఘకాలం పాటు యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల తీవ్రమైన మెదడు వ్యాధి (పార్కిన్సన్స్ డిసీజ్) వచ్చే అవకాశం ఉందని దక్షిణ కొరియాలోని సియోల్ నేషనల్ యూనివర్సిటీ హాస్పిటల్ పరిశోధకులు తెలిపారు. యాంటీబయాటిక్స్ సాధారణంగా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి, బ్యాక్టీరియా పెరగకుండా నిరోధించడానికి ఉపయోగిస్తారు. సాధారణ ఔషధంతో పాటుగా, యాంటీబయాటిక్ ఔషధం కూడా ఇవ్వబడుతుంది. దక్షిణ కొరియాలోని సియోల్ నేషనల్ యూనివర్శిటీ హాస్పిటల్ పరిశోధకులు యాంటీబయాటిక్స్ దీర్ఘకాలం తీసుకోవడం తీవ్రమైన మెదడు వ్యాధికి (పార్కిన్సన్స్ వ్యాధి) కారణమవుతుందని చెప్పారు. యాంటీబయాటిక్స్ మీ మెదడును ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పండి. సియోల్ నేషనల్ యూనివర్శిటీ హాస్పిటల్ పరిశోధకులు 40, అంతకంటే ఎక్కువ వయస్సు గల 298379 మందిపై పరిశోధనలు చేశారు. 1 సంవత్సరం పాటు యాంటీబయాటిక్స్ తీసుకున్న వారిలో, అలాగే 121 రోజులకు పైగా యాంటీబయాటిక్స్ తీసుకున్న వారిలో పార్కిన్సన్స్ వ్యాధి ప్రమాదం 29% పెరిగిందని, 121 రోజులు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు యాంటీబయాటిక్స్ తీసుకున్న వారిలో 37 శాతం ప్రమాదం ఉందని అధ్యయనం కనుగొంది. నిపుణుల సలహా మేరకు మాత్రమే యాంటీబయాటిక్స్ చాలా జాగ్రత్తగా వాడాలని, యాంటీబయాటిక్స్ ఎక్కువ కాలం తీసుకోకూడదని నిపుణులు భావిస్తున్నారు. మీరు సాధారణ ఔషధంతో సాధారణ ఫ్లూ లేదా వైరస్ను తగ్గించవచ్చు. అధిక మొత్తంలో యాంటీబయాటిక్స్ తీసుకోవడం మొత్తం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా వృద్ధులకు లేదా పిల్లలకు యాంటీబయాటిక్స్ నిపుణులను సంప్రదించిన తర్వాత మాత్రమే ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. పార్కిన్సన్స్ వ్యాధి అనేది నాడీ సంబంధిత రుగ్మత. ఇది మన మొత్తం ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.


దీని సాధారణ లక్షణాలు చేతులు వణుకు, కండరాలు దృఢత్వం, సమతుల్యతను కాపాడుకోవడంలో సమస్య. మెదడులో కండరాల కదలికను నియంత్రించే డోపమైన్ అనే రసాయనం లేకపోవడం దీనికి కారణం. యాంటీబయాటిక్స్ ఉపయోగించడం వల్ల పేగు మైక్రోబయోటాలో మార్పులు సంభవిస్తాయని పరిశోధనలు కూడా



# వ్యోమగామిగా బాలకృష్ణ..

## టైమ్ మిషన్ ఈజ్ బ్యాక్ అంటూ ఆదిత్య 369 సీక్వెల్‌పై క్లారిటీ

సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తొలి భారతీయ సైన్స్ ఫిక్షన్ సినిమాగా వచ్చిన చిత్రం ఆదిత్య 369 టైం మిషన్ కాన్సెప్ట్‌తో బాలకృష్ణ హీరోగా వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించి.. ఆల్‌టైమ్ సూపర్ హిట్ మూవీగా నిలిచింది. ఈ ఎవర్‌గ్రీన్ సినిమాకు సీక్వెల్ రాబోతుందంటూ ఇప్పటికే చాలా వార్తలు తెరపైకి వచ్చాయి. మూవీ లవర్స్‌తోపాటు నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ టైం రానే వచ్చింది. ఆదిత్య 369 సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చేశాడు బాలకృష్ణ. ఈ సీనియర్ యాక్టర్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే ఎపిసోడ్ 6 లుక్‌తో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చేశాడు. వ్యోమగామిగా మారిపోయిన్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆదిత్య 999 మ్యాక్స్ టైటిల్‌తో రాబోతున్న ఈ మూవీలో నందమూరి మోక్షజ్ఞ లీడ్ రోల్‌లో కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఇదే నిజమైతే మోక్షజ్ఞ కెరీర్‌లోనే వన్ ఆఫ్ ది ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోనుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సీక్వెల్‌పై ఫుల్ ఎపిసోడ్‌లో పూర్తి వివరాలు వెల్లడించబోతున్నాడు బాలయ్య. డిసెంబర్ 6న ఆహాలో ఫుల్ ఎపిసోడ్ స్ట్రీమింగ్ కానుంది. మోక్షజ్ఞ ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడని తెలిసిందే. మరి ఆదిత్య 369 రెండో సినిమాగా రాబోతుందా..? అనేది తెలియాల్సి ఉంది.



# విడుదల తేదీ ప్రకటించిన అజయ్ దేవగన్ 'రైడ్ 2'

బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం 'రైడ్'. ఇలియానా కథానాయికగా నటించగా.. సౌరభ్ శుక్లా, సానంద్ వర్మ కీలక పాత్రల్లో నటించారు. 2018లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ అందుకుంది. కేవలం రూ.40 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం రూ.150 కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది. ఇక ఇదే సినిమాను తెలుగులో మిస్టర్ బచ్చన్ పేరిటా రీమేక్ చేయగా.. డిజాస్టార్‌గా నిలిచింది. అయితే 6 సంవత్సరాల తరువాత బాలీవుడ్‌లో ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. 'రైడ్ 2'లో కూడా అజయ్ దేవగణ్ హీరోగా నటిస్తుండగా.. రితేష్ దేశ్‌ముఖ్, వాణి కపూర్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమాను మొదట ఫిబ్రవరి 21 2025 మహాశివరాత్రి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ విడుదల తేదీని ఫిబ్రవరి నుంచి మేకి వాయిదా వేశారు. ఈ సినిమాను మే 1న విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు. ఈ సినిమాకు రాజ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్, క్రిషన్ కుమార్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.





# పుష్ప యాక్టర్ ఫహద్ ఫాసిల్ బాలీవుడ్ ఎంట్రీ.. లవ్ స్టోరీ అట..!

టాలీవుడ్‌లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకోవడంతో పాన్ ఇండియా స్టార్‌డమ్ సంపాదించిన అతికొద్ది మంది మాలీవుడ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్ ఇటీవలే రజినీకాంత్ వెట్టైయాన్ సినిమాతో ప్రేక్షకులను పలుకరించాడు. ఫహద్ ఫాసిల్ నటిస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ పుష్ప ది రూల్ డిసెంబర్ 5న గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా ఈ స్టార్ యాక్టర్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారుతుంది. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్టు బాలీవుడ్ వర్గాల సమాచారం. లవ్‌స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుందని ఇన్‌సైడ్ టాక్. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని సమాచారం. తృప్తి డిమ్రి ఇప్పటికే ఇంతియాజ్ అలీ లైలా మజ్ను సినిమాలో నటించింది. మరి ఈ క్రేజీ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతుందని తెలుసుకోవాలంటే మరికొంతకాలం వెయిట్ చేయాల్సిందే.




# జాట్ మాస్ ఫీస్ట్..

## గోపీచంద్-సన్నీడియోల్ టీం ఎక్జయిటింగ్ న్యూస్

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని బీటౌన్ డెబ్యూ ఇస్తున్నాడని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీడియోల్ హీరోగా ఎస్‌డీజీఎంగా రాబోతున్న ఈ చిత్రానికి జాట్ టైటిల్‌ను ఫైనల్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఇప్పటికే మాస్ ఫీస్ట్ లోడింగ్ అంటూ మేకర్స్ లాంచ్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. ఇవాళ సాయంత్రం 4:05 గంటలకు ఎక్జయిటింగ్, భారీ అనౌన్స్‌మెంట్ అంటూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బీటౌన్ స్టార్ యాక్టర్ రణ్‌దీప్ హుడా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. రిషి పంజాబి సినిటోగ్రాఫర్ కాగా.. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై మేకర్స్ రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332